శ్రీమాత యొక్క స్మృతులు
పునః పరిశీలన



అఖిల

అఖిలభారత పత్రిక

ఏప్రిల్ 2012

13/4/2012

విషయసూచిక

24 ఏప్రిల్

పాండిచేరికి నా పునరాగమన వర్ధంతి --- ఇది ప్రతికూలశక్తులపై నిశ్చిత విజయానికి ప్రత్యక్ష సంకేతం.

శ్రీమాత

(CWM 13:63)

శ్రీమాత లక్ష్యం

(ఆమె *90* వ జన్మదినం నాడు)

1

21-2-68

జ్ఞాపకాలు సంక్షిప్తమైనవి.

శ్రీఅరవిందుల్ని కలుసుకోడానికై నేను భారతదేశం వచ్చాను. శ్రీఅరవిందులతో కలిసి జీవించడానికి నేను భారతదేశంలో ఉండిపోయాను. ఆయన తన పార్థివదేహాన్ని విడిచిపెట్టినప్పుడు, ఆయన నిర్దేశించిన కార్యాన్ని నిర్వర్తించడానికి నేను ఇక్కడే జీవిస్తున్నాను. సత్యాన్ని సేవిస్తూ, మానవాళి అంతర్వికాసానికి సహాయపడుతూ, భగవత్ ప్రేమ సామ్రాజ్యాన్ని భువిపై సత్వరంగా అవతరింపజేయడం ఆయన కార్యం.

2

నా లక్ష్యం ఏమిటో ఎలా తెలుసుకొన్నాను? *

భూమిపై సఫలీకృతం చేయవలసిన నా లక్ష్యం గూర్చి నేను ఎప్పుడు, ఎలా తెలుసుకోగలిగాను? నేను ఎప్పుడు, ఎలా శ్రీఅరవిందుల్ని కలుసుకున్నాను?

ఈ రెండు ప్రశ్నలు మీరు అడిగారు. సంక్షిప్తంగా జవాబు చెప్తానని మాట ఇచ్చాను.

లక్ష్యం గూర్చి జ్ఞానం ఎప్పుడు వచ్చిందో చెప్పడం కష్టం. ఆ లక్ష్యంతోనే నేను పుట్టాననిపిస్తోంది. మనసు, మెదడు పెరగడంతో పాటు ఈ చైతన్యపు విస్పష్ట పరిపూర్ణత్వం కూడ వికాసం చెందింది.

11, 13 సంవత్సరాల మధ్య భగవంతుని అస్తిత్వం గూర్చి నాకు కలిగిన ఆధ్యాత్మిక అనుభవాలు నాకు బహిర్గతం చేశాయి. అంతే కాదు, మనిషి భగవంతునితో సాయుజ్యం చెందగలడని, చైతన్యంలో, కార్యాచరణలో సంపూర్ణంగా ఆయన్ని సిద్ధి పొందగలడని, దివ్యజీవన రూపంలో ఆయన్ని భూమిపై అభివ్యక్తం చేయగలడని కూడా ఆ అనుభవాలలో గోచరించింది. ఆ లక్ష్యం సాధించడానికి ఆచరణాత్మకమైన

---

* 1920 చివర్లో ఒక విజ్ఞప్తిని పురస్కరించుకొని, శ్రీమాత ఒక లేఖ వ్రాసారు. అది చందన్ నగర్ నుండి వెలువడే ఒక పత్రికలో ప్రచురించారు.

శిక్షణను నా నిద్రలో అనేకమంది గురువుల ద్వారా నేను పొందాను. తరువాత భౌతికభూమికలో వారిలో కొందరిని నేను కలుసుకున్నాను.

అనంతరం, అంతరంగ, బాహ్య అభివృద్ధి కొనసాగుతుండగా వారిలో ఒకరితో ఆధ్యాత్మిక, చైత్యసంబంధం మరింత విస్పష్టం అయింది. తరుచూ ఆ బంధాలు కొనసాగాయి. ఆ సమయంలో నాకు భారతీయ తత్వశాస్త్రాలు, మతాలు గూర్చి తెలియనప్పటికీ, అతనిని శ్రీకృష్ణుడని తలిచాను. (అతనిని భూమిపై ఒక రోజు కలుసుకోగలనని నాకు తెలుసు) అతనితోనే దివ్యలక్ష్యం నెరవేరుతుందని నాకు స్పృహ కలిగింది. 1910 లో నా భర్త ఒక్కరే పుదుచ్చేరి వచ్చి, ఆసక్తికరమైన, వింత పరిస్థితులలో శ్రీఅరవిందులతో పరిచయం ఏర్పరుచుకున్నారు. అప్పటి నుండి ఇండియాకు రావాలని గట్టిగా కోరుకున్నాను. భారతదేశం నా నిజమైన మాతృదేశం అని భావిం చాను. 1914 లో ఈ సంతోషం మాకు దక్కింది.

నేను శ్రీఅరవిందులను చూడగానే, నేను శ్రీకృష్ణుడని అని పిలిచే సుప్రసిద్ధ వ్యక్తిని ఆయనలో గుర్తించాను. ఇది చాలు నేను భారతదేశంలో ఆయన సమీపంలోనే నా స్థానం, నా దివ్యకార్యం ఉన్నట్లు నేను పూర్తిగా ఎందుకు నమ్మానో వివరిస్తుంది.

పుదుచ్చేరి, 1920

3

1954 ఆగస్టు 15: ఒక ప్రకటన

భారతీయ పౌరురాలుగా అయ్యాను. ఎప్పటి నుండో కోరుకున్న అభిలాష వ్యక్తమైన రోజుగా దీనిని నేను గుర్తుపెట్టుకున్నాను. 1914 లో మొదటిసారి నేను భారతదేశం వచ్చినప్పటి నుండి, భారదేశమే నా నిజమైన దేశమని, నా ఆత్మకు ఆత్మీయదేశమని నేను భావించాను. భారతదేశం స్వేచ్ఛ పొందగానే నా అభిలాషను సఫలీకృతం చేసుకోవాలని నిర్ణయించాను. కాని పుదుచ్చేరిలోని ఆశ్రమం బాధ్యతలు భారంగా ఉన్నందున నేను ఇంకా ఎక్కువ కాలం నిరీక్షించవలసి వచ్చింది. ఇప్పుడు సమయం ఆసన్న మైనది. నేను నా అభిలాషను వ్యక్తం చేసుకోవచ్చు.

కాని శ్రీఅరవిందుని ఆదర్శ ప్రకారం విభజనలో కన్న ఐక్యతలోనే సత్యం ఉన్నదని నేను నిరూపించదలుచుకున్నాను.

ఒక జాతీయతను వదులుకొని, మరో జాతీయతను స్వీకరించడం ఆదర్శవంత మైన పరిష్కారం కాదు. నేను ద్వంద్వ జాతీయత అనుసరించేందుకు అంటే

ఫ్రెంచి దేశస్థురాలిగానే ఉంటూ భారతీయురాలిగా ఉండడానికి అనుమతి ఇవ్వబడుతుందని నేను ఆశిస్తున్నాను.

జన్మతహ నేను ఫ్రెంచి దేశస్థురాలిని. నా చదువు సంధ్యలు కూడా ఫ్రాన్స్‌లోనే జరిగాయి. నా అభిమతం, అభిమానం భారతీయురాలిగానే ఉండాలని. నా చైతన్యంలో రెండూ వ్యతిరేకం కాదు. అవి మరింత బాగా కలిసిపోయి, ఒకదాని నొకటి పూరించు కొంటాయి. ఇరుదేశాలకు నా సేవలు సమానంగా చేస్తానని నాకు తెలుసు. శ్రీఅరవిం దుని మహనీయ ప్రబోధానికి ఘనరూపం ఇవ్వడమే నా జీవనధ్యేయం. అన్ని జాతులు ఒక్కటే. వ్యవస్థీకృతమైన, సమన్వయ ప్రదీప్తమైన వైవిధ్యం ద్వారా భూమిపై దైవసామ నస్య ఐక్యతా మాధుర్యాన్ని అవి అన్నీ కలిసి అభివ్యక్తం చేయడానికే పురోగమిస్తు న్నాయి.

4

ఒక సర్వలోకాతీతమైన, సర్వకాలాతీతమైన మహోన్నత, మహోత్కృష్ట దైవచైతన్యం ఉంది. భౌతిక జీవనంలో ఈ దివ్యచైతన్యాన్ని వ్యక్తం చేయాలని మా కోరిక.

*

ప్రపంచాన్ని భగవత్ పరంగా జయించాలని మా ఆకాంక్ష. ప్రపంచంలోని అన్ని చలనాలను జయించాలి. అదే లక్ష్యం. ఇక్కడే ఈ భూమిపైనే భగవత్ సాక్షాత్కార సిద్ధిని పొందాలని మా ఏకైక కాంక్ష.

*

భువన జీవనం నుండి తప్పించుకోవడానికి బదులు భౌతికజీవన దివ్యీకరణ, పరివర్తన లక్ష్యంగా మొదటిసారిగా పూర్ణయోగం రూపొందించబడింది.

*

మేము పరిపూర్ణ రూపాంతరీకరణను కోరుతున్నాం. శరీరము, శరీర కార్యకలాపా లన్నీ రూపాంతరం చెందాలి. కాని ఏ చర్య తీసుకోడానికైనా ముందుగా, అనివార్య మైన తొలి సోపానం — చైతన్యపరివర్తన — మనోదృక్పథంలో మార్పును గూర్చి నేను చెప్పడం లేదు. చైతన్యంలోనే సమూలమైన మార్పు రావాలి. అది... అదే మా పరమావధి.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

శ్రీమాత తనను గురించి

1

అతను లేక నేను లేను,

నేను లేక అతను అవ్యక్తుడు.

6-5-1957

2

ఈ పుడమి పుట్టుక నుండి, ఎచ్చటైనా, ఎప్పుడైనా దివ్యచేతనా కాంతికిరణ ప్రసరణకు అవకాశ మేర్పడినప్పుడల్లా నేనక్కడ ఉన్నాను.

13:37

3

నేను నా సిద్ధాంతము: ఒక్క దైవానికి తప్ప, నేను ఏ జాతికి, ఏ దేశానికి, ఏ నాగరికతకు, ఏ సమాజానికి, ఏ సంఘానికి, ఏ సంతతికి చెందినదానను కాను.

ఒక్క దైవాజ్ఞను తప్ప, నేను ఏ అధికారిని, ఏ ప్రభువుని, ఏ నియమావళిని, ఏ సాంఘిక సాంప్రదాయాన్ని ఖాతరు చేయను.

నా సర్వస్వాన్ని, సంకల్పాన్ని, జీవితాన్ని, ఆత్మను, ఆ దైవానికే సమర్పించాను.

అదే దైవేచ్ఛ ఐతే, నా రక్తపు బొట్టు బొట్టును దైవం కోసం పరమానందంగ సమర్పించుటకు సంసిద్ధంగ ఉన్నాను.

భగవత్ సేవలో ఏది కూడ త్యాగం కాదు, కారణం, సర్వమూ పరిపూర్ణమైన పరమానందం గనుక.

జపాను, ఫిబ్రవరి 1920

13:37-38

4

ఒకే ఒక్క విషయం నేను గట్టిగ నమ్ముతాను. అది నేనెవరిని అని. శ్రీఅరవిందులకు గూడ అది తెలుసు. వారు ప్రకటించారు కూడ. మానవజాతి అంతా సంశయించినా ఇది తిరుగులేని సత్యం.

అయితే, అంతగా నమ్మికలేని విషయం మరొకటి ఉంది. నేను చేయుచున్న

పనిని చేయుటకుగాను ఇచ్చట దేహధారినై ఉండుటలోగల ప్రయోజనం. నా వ్యక్తిగత ప్రేరణతో ఇది నేను చేయుటలేదు. శ్రీఅరవిందులు నన్ను ఇది చేయమని ఆదేశించారు. అందుకని భగవదాదేశానికి బద్ధురాలినై దీనిని ఒక పవిత్ర విధిగా నిర్వర్తిస్తున్నాను.

ఈ పృథ్వి ఎంత మేరకు ఇందు మూలంగా లబ్ధిపొందిందో కాలమే వెల్లడిస్తుంది.

24-5-1951

5

ప్రశ్న: సర్వేశ్వరుడు మిమ్ములను ప్రపంచ సృష్టి గావించమని ఆదేశించినప్పుడు ఏమి చేయాలో మీరు ఎలా తెలుసుకున్నారు?

ఇందులో నేను తెలుసుకోవలసినది ఏమీ లేదు. ఎందుకనగా ఆ సర్వేశ్వరుడు సర్వమును తనయందే ఇముడ్చుకొని ఉన్నాడు గనుక: సమస్త విశ్వము, తత్సంబంధిత పరిజ్ఞానము, దానిని సృష్టించగల శక్తి. సృష్టి చేయాలని ఆతడు సంకల్పించినప్పుడు మొదటగా ప్రపంచ పరిజ్ఞానాన్ని, దానిని సృష్టించగల శక్తిని బయల్పరిచాడు. అదే నేను. తదుపరి సృష్టి గావించమని నన్ను ఆజ్ఞాపించాడు.

259-9-1957

ప్రశ్న: మీరు మాలాగ ఎందుకు వచ్చారు? మీ నిజస్వరూపంతో ఎందుకు రాలేదు?

ఎందుకంటే నేను మీలాగ రాకపోయినట్లయితే, ఎప్పటికి మీకు దగ్గరయ్యేదాన్ని కాదు. "నా మాదిరిగ మీరు కూడ కావాలి" అని మీకు చెప్పలేకపోయేదాన్ని.

ప్రశ్న: శ్రీమాతా "మీరు దైవమా?" ఈ ప్రశ్నకు మీ సమాధానం?

ఈ ప్రశ్న ఏ మానవమాత్రుడినైనా అడగవచ్చు. సమాధానం: అవును, సంభవనీయమే. దీనిని సార్థకపరచుట ప్రతి ఒక్కరి కర్తవ్యం.

6

ప్రభూ, నా మానవ పరిమితులు నాకు విచారం కలిగిస్తున్నాయి.... కాని వాటి మూలంగానే మానవులు మీ దరి చేరగలుగుతారు. మీరు దేహధారులు కానట్లయితే మానవుల కెంత దూరమయ్యేవారో, మీ సాన్నిధ్యం ఎంత దుస్సాధ్యమయ్యేదో, ఈ పరిమితులు లేకపోతే మీకు చేరువగుట అంత కష్టతరమయ్యేది.

ఆ కారణంగా, వారు ప్రగతి పథంలో వేసే ప్రతి అడుగు నా ఒక్కొక్క పరిమితిని ఛేదించి మిమ్ములను మరింత వాస్తవంగా, మరింత పరిపూర్ణంగా వ్యక్తపరచే

సదవకాశాన్ని కలిగించి నాకు ముక్తి కారకమౌతుంది.

అయితే ఈ పరిమితులు లేకుండ కూడ ఉండవచ్చు. కాని, అప్పుడు ఒక్కసారైనా తమ అంతరంగంలోగాని, లేక విశ్వగతంగా గాని ఎవరైతే భగవత్ సాన్నిధ్యాన్ని అనుభవించగలిగారో, ఎవరైతే తమను తాము దైవంతో మమేకం చేసుకోగలిగారో వారి సాన్నిధ్యంలో తప్పక ఉండవలసి వచ్చేది. ఎందుకనగా ఈ విధమైన సాన్నిహిత్యం మన యోగానికి మూలము. అక్కడే అది ప్రారంభమయ్యేది.

17-7-1932

13:83

7

వారు ప్రేమించేది నన్ను కాదు. వారు తమకు తాము, మానసికంగాను, ప్రాణికంగాను, రూపొందించుకున్న నా ఆకృతిని. ఈ విషయాన్ని నేను తరచుగా ఎదుర్కొంటున్నాను. ప్రతి ఒక్కరు వారి స్వంత అవసరాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా నా రూపాన్ని మలుచుకుంటున్నారు. నా ఈ రూపంతోనే సంబంధం ఏర్పరుచుకుని దాని ద్వారా కొద్దిపాటి విశ్వగత శక్తులను స్వల్పంగా అధిమానస శక్తులను రాబట్టుకొన్న మేరకు పొందగలుగుతున్నారు. దురదృష్టం ఏమిటంటే, వారు నా భౌతిక ఉనికిని పట్టుకు వ్రేలాడుతున్నారు. లేనట్లయితే నా అంతరంగ ఏకాంతలోనికి నిష్క్రమించి నా పనిని ప్రశాంతంగా, స్వేచ్ఛగా నెరవేర్చుకోగలిగేదాన్ని. కాని ఈ నా భౌతిక ఉనికి వారికి ఒక సంకేతంగా ఉన్నందున దానినే అంటిపెట్టుకొని ఉంటారు. అసలు వారికి నా నిజదేహం ఏమిటో, అది ఏ మహాద్భుత చేతనాశక్తి సంకలనానికి ప్రతీకనో, దానితో సంబంధం అతి స్వల్పం.

11-6-1954

8

ఓ ప్రభూ, నేను ప్రేమించేది నిన్ను మాత్రమే గనుక అందరిలోను, ప్రతి ఒక్కరిలోను నేను ప్రేమించేది నిన్నే. నిన్నే వారిలో గాఢంగా ప్రేమిస్తున్నందు వలన, నీ గురించి వారిలో కొద్దిపాటి చైతన్యమైనా కలిగించుటలో కృతార్థురాలనవుతాను. నిష్పక్షపాతంగా, నిరాటంకంగా ప్రేమించబడుట ఎలానో వారు తెలుసుకొనుట అవసరము. అయితే, వారి కిష్టమైన రీతిలో తప్ప మరో విధంగా ప్రేమించబడుటకు వారు ఇచ్ఛగించరు సరికదా, ఆ ప్రేమ వారు ఎన్నుకున్న మాధ్యమం ద్వారా

అందితే తప్ప, దానిని స్వీకరించుటకు వారిని వారు ఉన్మీలనం చేసుకోలేరు. పర్యవసానంగా, ఏ కార్యమైతే కొన్ని గంటలలోనో, కొన్ని నెలలలోనో లేక కొన్ని సంవత్సరాలలోనో నెరవేర్చబడగలదో దానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఆగమనము

1

ఇంకొక ఐదు సంవత్సరాల్లో నాకు వందేళ్ళు పూర్తి అవుతాయి. నాకు ఐదు సంవత్సరాలున్నప్పట్నుంచీ చైతన్యవంతంగా ఉండాలనే ప్రయత్నం ప్రారంభించాను. అది ఇంకా కొనసాగుతోంది. అలాగే సాగుతుంది. అయితే ఇప్పుడు శరీరకణాల కోసం పనిచేసే దాకా వచ్చాను. ఇది కూడా చాలా కాలం క్రిందటే ప్రారంభమైంది.

ఇదంతా నిన్ను నిరుత్సాహపరచాలని చెప్పడం లేదు — అది దానంతటదే జరిగిపోదని నీకు తెలియాలని చెపుతున్నాను.

8-2-1973

2

అబ్బ! ఓహ్! చాలా కష్టమైన సమస్యలు మీ ముందు ఉంచుతున్నానా! కానీ నేను అయిదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడే వాటి మీద మనసుపెట్టి ఉండేదాన్ని. అందువల్ల మీరు కూడా చాలా కాలంగా దాని గురించి ఆలోచిస్తున్నారనుకున్నాను.

ఒక సాధకుడు: ఒక్కరిలోనే పరస్పర విరుద్ధ సంకల్పాలుంటాయి.

అవును, చాలా ఉంటాయి. మొట్టమొదట కనిపెట్టవలసినవి ఇవే. ఒక భాగమేమో ఈ విధంగా ఉండాలనుకుంటుంది; మరుక్షణమే ఇంకోవిధంగా అనుకుంటుంది, మూడోసారి మళ్ళీ ఇంకోటి అనుకుంటుంది! ఇంతేకాక ఇంకోటి కూడా జరుగుతుంది: ఒక భాగం కావాలి అని అనుకుంటే ఇంకోటి వద్దంటుంది. అయితే నిన్ను నీవు సక్రమస్థితిలో ఉంచుకోవాలని ఏమాత్రం అనుకున్నా అది దేనివల్ల జరుగుతోందో సరిగ్గా దానిని కనుక్కోవాలి. సినిమాలో మాదిరి నిన్ను నీవు ఆ తెర మీద ప్రక్షేపించుకొని కదలాడుతున్న నిన్ను పరికించుకోవచ్చు గదా? అది సరదాగా ఉండదూ!

ఇది మొదటి మెట్టు. అలా ఆ తెర మీద కదిలేవన్నీ చూస్తూ ఏం జరుగుతున్నదో దాన్ని కాయితం మీద పటంగా గీసినా ఆసక్తిగానే ఉంటుంది. అలా కొంతసేపు గడిపితే, అలా చూడడానికి అలవాటు పడతావు. అప్పుడు ఇంకొంత ముందుకు కదిలి ఒక నిర్ణయానికి రావచ్చు. అలా కాక ఇంకా పెద్ద అడుగు వేసి నీ వ్యవస్థను చక్కగా సర్దుకోవచ్చు. అంతా చక్కబెట్టుకున్న తర్వాత నీ అంతరంగాన్ని అనుసరించి సూటిగా కదలవచ్చు. అప్పుడు నీ మార్గం నీకు సుబోధకమై ఇలా అనుకుంటావు, "ఇది బాగుంది; నా జీవితం ఈ మార్గంలో అభివృద్ధి పొందుతుంది, అదే నా జీవికి సరైన విధానము. నా లోపల అన్నిటినీ బాగా సర్దుకోవటం వల్ల దేని స్థానంలో అది సరిగ్గా ఇమిడి ఉంది. ఈ విధంగా లోపల ఒక దిశానిర్దేశం జరుగుతోంది. నేను దాన్నే అనుసరిస్తున్నాను. ఇంకొక్క అడుగు కదిలానంటే నాకు ఏం జరుగబోయేది తెలుస్తుంది; అది నిర్ణయించేది కూడా నేనే కదా!". నీవేమనుకుంటున్నావో నాకు తెలియదు కానీ నాకు మాత్రం ఇది మహా సరదాగా ఉండేది, ప్రపంచంలో అన్నిటినీ మించిన ఆసక్తికరంగా ఉండే విషయం ఇది. ఇంతకు మించిన ఆసక్తికరమైనది వేరొకటి ఉండేది కాదు.

నాకు జరిగిన విషయమే ఒకటుంది. అప్పుడు నాకు ఐదారు సంవత్సరాలుండేవి. ఏడో ఏడు వచ్చేసరికీ ఇది మరీ తీవ్రమైపోయింది. మా నాన్నగారికి సర్కస్సంటే చాలా ఇష్టం కాబట్టి ఒక రోజు నా దగ్గరకు వచ్చి "ఆదివారం నాడు సర్కసుకు వెడదాం రామ్మా" అని పిలిచారు. నేను "ఒద్దు నాన్నా! నేనిక్కడ సర్కసు కంటె సరదాగా ఉండే పనొకటి చేస్తున్నాను" అని బదులిచ్చాను. ఇంకొకసారి మా స్నేహితులు కొందరు ఒక సమావేశానికి రమ్మనీ అక్కడ అంతా కలిసి సరదాగా ఆడుకుందామనీ పిలిచారు. దానిక్కూడా నేను "నేను రాను, నా కిక్కడే ఇంకా బాగుంటుంది" అని చెప్పాను. నేను మనస్ఫూర్తిగా అలా చెప్పాను. అది బూటకం కాదు, నిజంగానే నాకు అలా అనిపించేది. ప్రపంచకంలో అంతకు మించిన సరదా మరొకటి ఉండేది కాదు.

ఈ విధంగా ఇంత ఉత్సాహంగా మనస్ఫూర్తిగా ఎవరు చేసినప్పటికీ మంచి ఉత్సాహభరిత ఫలితాలు పొందగలరనే నమ్మకం నాకుంది. అంటే మనలో జరిగే కార్యక్రమమంతా తెర మీద ఉంచి ఏం జరుగుతుందో చూడటమనేది...

పూర్వపు ఋషులు "నిన్ను నీవు తెలుసుకో" అనటంలో అర్థం ఇదే ననుకుంటా.

ఇంతకు మించి ఏమీ లేదు. ఇంకా చెప్పాలంటే కళ్ళకు గంతలు కట్టుకొని ముక్కుకు సూటిగా వెళ్లి తలకు కొట్టుకొని అక్కడ గోడో, మూసివున్న తలుపో, ఒక దుష్టసంకల్పమో ఉన్నట్లు తెలుసుకొనేదాని కన్నా నిన్ను నీవు తెలుసుకోటానికి సంవత్సరాల తరబడి అన్ని రకాల దురదృష్టకర పరిస్థితులూ, చికాకు సంఘటనలూ ఎదుర్కోవలసిన అవసరం లేకుండా, నేను చెప్పినట్లు ప్రశాంతంగా ఈ పని చేయవచ్చు.

నేను అలా చేసేటప్పుడు సినిమాలు లేవు కాబట్టి నేను దానితో పోల్చి చెప్పలేను. లేకపోయినప్పటికీ అది అచ్చంగా అటువంటిదే. లోపల ఉన్నదాన్ని వస్తుమాత్రంగా తెర మీద దృశ్యమానం చేసినట్లే. ఆ తెర చాలా తెల్లగా, నునుపుగా ముడుతలతో దృశ్యాన్ని చెడపకుండా ఉండేటట్లు చూడాలి.

ప్రతి రోజూ ఐదు నిమిషాలు చొప్పున ఈ విధంగా నిన్ను నీవు చూసుకోవడం మొదలుపెట్టు. నీలో ఏం జరుగుతోందో చూడు.

29-7-1953

3

తనలోని దివ్యకేంద్రం చుట్టూ తనను తాను ఏకీకృతం చేసుకోవడమే వ్యక్తికి, అన్నిటిలోకి ముఖ్యమైన విషయము, ఆ విధంగా అతను అసలైన వ్యక్తిగా తనకూ తన భవితవ్యానికీ కర్త కాగలడు. అలా కాని పక్షంలో అతను వివిధ శక్తులకూ ఆట బొమ్మగా ఆడుతూ ఒక ప్రవాహంలో పడేసిన బెండుముక్కలాగా అయిపోతాడు. వెళ్ళకూడదనుకునే చోటికే వెళ్ళటం, ఒద్దనుకున్న పనులే చేయవలసి రావడం, చివరకు లేవటానికి ఏమాత్రం శక్తి లేకుండా గోతిలో కూరుకొనిపోతాడు. కానీ నీవు చైతన్యవంతంగా వ్యవస్థీకృతుడవై, నీలోని దివ్యకేంద్రం చుట్టూ ఏకీకృతుడవై దాని పాలనలో, దర్శకత్వంలో గనక ఉన్నావంటే, నీ అదృష్టం నీ చేతిలోనే ఉంటుంది. ప్రయత్నించితే తగిన ఫలితం ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ బానిసగా ఉండటం కంటే యజమానిగా ఉండటమే మేలని నేననుకుంటాను. నీ కిష్టమున్నా లేకపోయినా తోలుబొమ్మలాగా ఆడుతూ పనులు చేయడం చాలా చికాకు కలిగిస్తుంది. అదంతా అప్రస్తుతమే అయినప్పటికీ చెపుతున్నాను. నీకు తెలియకుండా ఎవరో నీకు దారాలు కట్టి లాగుతుంటే నీవు కదలాడుతూండటం — అది చాలా విసుగు కలిగిస్తుంది. మిగిలినవారి సంగతి ఎట్లున్నా, నాకు మాత్రం చిన్నప్పుడు ఆ విషయంలో చాలా కోపంగా ఉండేది. ఐదేళ్ళు వచ్చినప్పుడదింక భరింపరానిదవటం వల్ల ఎవరూ

నన్ను కోప్పడకుండా ఉండే ఇంకో విధానాన్ని కనుక్కోవాలనుకున్నాను. ఎందుకంటే ఈ విషయం చెప్పడానికి ఇపుడు మీకున్నట్లుగా నాకెవ్వరూ లేకపోయారు. "నీవు చేయవలసింది ఇదీ" అని చెప్పేవారే లేరు. అదంతా నా అంతట నేనే తెలుసుకోవలసి వచ్చింది. చివరికి తెలిసింది. అదంతా అయిదు సంవత్సరాలప్పుడే ప్రారంభించాను.

1-7-1953

4

నా బాల్యం నుంచీ నేనొక విషయం వింటున్నాను. అదేమిటంటే నీవు దేనిలోనైనా విజయం సాధించాలంటే దానిని మాత్రమే చేయాలి. బహుశా మా తాతముత్తాలు అదే విని ఉంటారు, అనాది నుంచీ ఈ బోధ జరుగుతూనే ఉంది. కానీ నేను మాత్రం అనేక రకాల పనులు చేస్తూండటం వల్ల నాకెప్పుడూ తిట్లుపడేవి. ఒక వైపు చదువూ, చిత్రలేఖనం, సంగీతం ఇంకా పలురకాల పనులు కూడా చేసేదాన్ని. నేను సంగీతసాధకురాల్ని కాలేననీ, చిత్రలేఖనం పనికిరాకుండా పోతుందనీ, చదువు అంతంత మాత్రమే అవుతుందనీ కోప్పడేవారు. అది నిజమే కావచ్చు కానీ, ఇలా చేయడంలో కొన్ని సదుపాయాలున్నట్లు గ్రహించాను. నేను మీతో చెప్పినట్లు మనస్సు పరిధిని విస్తృతం చేసుకోవడం, అవగాహన పెరిగేటట్లు మనస్సు సుతిమెత్తనగా మలచడం, మొదలైనవి. ఒకటో రకం సంగీత విద్వాంసురాలినై కచేరీలు చేయాలంటే వారు చెప్పినట్లు చేయడం తప్పనిసరి. చిత్రలేఖనంలో కూడా ఆ కాలపు గొప్ప చిత్రకారుల సరసన నేను నిలబడాలనుకుంటే వారు చెప్పినట్లు చేయడం తప్పనిసరి. అది అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ అది ఒక రకమైన దృక్పథము. కానీ ఒక గొప్ప విద్వాంసురాలినో, చిత్రకారిణివో కావల్సిన అవసరం నాకు కనిపించలేదు. అదొక స్వాతిశయంగా నాకు అనిపించేది. ఏమైన, ఇది అభిప్రాయానికి చెందిన విషయం.

10-2-1954

5

దురదృష్టం ఏమిటంటే నీ పనులన్నిటితో నీవు పూర్తి వ్యావృతంగా ఉండటము. నీ వయసులో నేను కేవలం నా చదువులోనే మునిగి ఉండేదాన్ని. విషయసంగ్రహణం, నేర్చుకోవడం, తెలుసుకోవడం, అవగాహన చేసుకోవడం మొదలైనవాటిలో. అది కేవలం ఆసక్తే కాక అభిలాష కూడా. మా అమ్మగార్కి నేనన్నా, మా అన్నయ్యన్నా

వెర్రి ప్రేమ ఉండేది. మేము చిటపటలాడుతున్నా, తృప్తిపడకపోయినా, సోమరిగా ఉన్నా ఆమె ఊరుకునేది కాదు. ఎప్పుడైనా ఆమెతో ఏదైనా పితూరీలు చెప్పినా, అసంతృప్తిగా ఉన్నా ఆమె ఒక నవ్వు నవ్వి మమ్మల్ని కోప్పడి ఇలా అనేది. "ఎంత తెలివితక్కువ? నవ్వులాట చేయకండి, వెళ్ళి పనిచేసుకోండి, అంతే కాని మనసు బాగుందా లేదా అని ఆలోచించకండి. అదేమీ బాగుండదు".

అమ్మ సరిగ్గా చెప్పారు. ఆ విధంగా క్రమశిక్షణను, తనను తాను మరచి చేసే పనిపై దృష్టి పెట్టడం నేర్పించినందుకు నేను సదా ఆమెకు కృతజ్ఞురాలినై ఉన్నాను.

నీ కిదంతా ఎందుకు చెపుతున్నానంటే నీవు నీ పనిలో తలమునకలుగా ఉండటం వల్ల నీకు ఆందోళన కలుగుతున్నట్లుండటం వల్లనే. నీవు ఇప్పుడు చేస్తున్న సంగీతం, చిత్రకళపై ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపించడం మంచిది. ఇంకా ఎదగని నీ మనస్సును విస్తరింప చేసుకోవాలి. మానవుడు అనాగరికంగా, అజ్ఞానిగా ఉండటానికి ఇష్టపడనప్పుడు అత్యంతావశ్యమైన ప్రాథమిక విజ్ఞాన విషయాలు అభ్యసించడం మొదలైనవి చేయాలి.

నీవు పద్ధతిగా ప్రతి రోజూ ఎనిమిది తొమ్మిది గంటలు పనిచేశావంటే బాగా ఆకలేసి బాగా తిని ప్రశాంతంగా నిద్రపోతావు. అపుడు నీ మనసు బాగుందా, బాగా లేదా అని ఆలోచించే అవకాశమే ఉండదు.

ఇదంతా నీ మీద నాకున్న ప్రేమతో చెపుతున్నాను, అర్థం చేసుకుంటావనే అనుకుంటున్నాను.

నిన్ను ప్రేమించే నీ తల్లి

15-5-1934

6

చిన్నప్పుడు తినే విషయంలోనూ, ఇంకా చిన్న చిన్న విషయాల్లోనూ బాధను అమ్మతో చెప్పుకుంటుంటే అటువంటి చిన్న విషయాలు పట్టించుకోకూడదనీ, చేయవలసిన పని చేస్తూ, చదువుకోవలసినవి చదువుకోమనీ చెప్పేది. "సరదాగా సుఖం కోసమే పుట్టానని అనుకుంటున్నావా" అంటూ, నీ వొక అత్యున్నత ఆదర్శాన్ని అందుకోటానికే పుట్టావు" అని చెప్పి నన్ను పంపించేసేది. అది అక్షరాలా నిజం,

అయితే ఆమె దృష్టిలో ఉన్న అత్యున్నత ఆదర్శము మనం అనుకుంటున్న స్థాయికి చాలా తక్కువ.

1930-31

7

ఇదంతా నాకు మూడూ, ఏడూ ఏళ్ళ వయస్సు మధ్య జరిగిన విషయము. నేను నిజంగా చెపుతున్నాను. ఒకసారి ఫొటో దిగటానికని తయారవుతున్నాను. చక్కగా బట్టలు, తలకు హేట్ ధరించాను, పొటోకి ఎలా తీరుగా ఉండాలో చెప్పే పెద్దవారి వంక చూస్తే "ఇదంతా ఎంత క్రూరతనం" అనిపించింది.

మొదటిసారిగా నా తల్లి అబద్ధం చెప్పడం నా చెవిన పడింది. నాకు చాలా చిన్నతనం అనిపించింది. ఆమె వంక చూశాను. అది హాస్యాస్పదమే. ఎందుకంటే ఆమె పనివానితో "నేనిక్కడ లేనని చెప్పు" అన్నారు. అది నాకు అసలు అర్థం కాలేదు. ఆమె అక్కడే ఉన్నారు కదా!

అబద్ధమంటే ఏమిటో నాకెవరూ వివరంగా చెప్పలేదు. కానీ మానసమనేది ఉందిగా. దానికి తెలుసు. ఒకసారి... మా ఇంట్లో ఒక చిన్న గోడపైన ఎత్తుగా అల మార ఉండేది. దానిలో మందులుండేవి. మా అన్న నన్ను పిలిచి అక్కడ ఒక బల్ల పైకెక్కి ఆ అలమారలో నుంచి ఒక పొట్లం తీయమన్నాడు. మా అన్న చెప్పినట్లే చేయడం అలవాటున్న బుద్ధిమంతురాలిని కాబట్టి అలాగే బల్ల నెక్కి ఒక పొట్లం తీసి (ఒక రకమైన మూలికలతో చేసిన తీపిమందు) ఇచ్చాను. అతను "ఎవ్వరితోనూ ఏమీ చెప్పవద్దు" అన్నాడు. నేను అతని వైపు చూశాను. నాకు గుండెల్లో (శ్రీమాత హృదయాన్ని చూపుతారు) ఒక రకమైన వ్యాకులత కలిగింది. నా తల్లి తిరిగివచ్చి ఆ పేకెట్ ఏమైందని అడిగితో నేనేమీ చెప్పలేదు. నాకు చాలా కాలం దాకా ఆ వ్యాకులత ఉండేది. "అదే కాబోలు — అబద్ధమంటే" అనుకునేదాన్ని.

8

నాకు సుమారు పదమూడు సంవత్సరాలున్నప్పుడు ఒక సంవత్సరం పాటు ప్రతి రాత్రీ నిద్రపోగానే శరీరం నుంచి బయటకు వచ్చేసినట్లుగా ఉండేది. ఆ విధంగా లేచి తిన్నగా ఇంటి పైకీ, ఇంకా బాగా ఎత్తుగా ఊరిపైకి ఎగురుతున్నట్లుండేది. నేను బంగారపురంగులో దేదీప్యమానమైన ఒక పొడుగుపాటి అంగీని ధరించినట్లూ, నేను పైపైకి వెళ్ళినకొద్దీ అది విస్తరించి నా చుట్టూ పరుచుకొని ఆ పట్టణం పై

భాగమంతా ఆక్రమించినట్లు చూసేదాన్ని. అపుడు అన్ని వైపుల నుంచీ మగవారూ, ఆడవారూ, పిల్లలూ, వృద్ధులూ, రోగులూ ఇంకా అనేకమంది బాధితులూ ఆ గుడారం వంటి వస్త్రం కిందకు వచ్చి వారి బాధలనూ, కష్టాలనూ వివరిస్తూ సహాయ మర్థించు తున్నట్లూ కనపడేది. దానిగి సమాధానంగా ఆ వస్త్రం అతి మృదువుగా ప్రాణ మున్నట్లుగా అందరివైపుకీ చాచుకునేది. వారంతా దాన్ని ముట్టుకోగానే ఓదార్పును, నివారణనూ పొంది చాలా సంతోషంగా, బలంగా వారి శరీరాల్లోకి తిరిగి వెళ్ళేవారు. అంతకంటే సుందర దృశ్యం ఇంకొకటి నేను చూడలేదు, ఇంకేదీ నన్ను అంత సంతోషపరచలేదు. దీని ముందు మిగతా రోజువారీ కార్యక్రమాలన్నీ కళావిహీనంగానూ, మందకొడిగానూ, నిర్జీవంగానూ కనిపించేవి. రాత్రి పూట జరిగే ఈ కార్యక్రమమే నిజమైన జీవితంగా ఉండేది. ఈ విధంగా పైకి లేచి వెడుతున్నప్పుడు అప్పుడప్పుడు నా ఎడమ ప్రక్కన నిశ్శబ్దంగా, స్థిరంగా ఒక వృద్ధుడు నిలబడి ఉండటం కనిపించేది. ఆయన వాత్సల్యపూరితంగా తన ఉనికితో నన్ను ప్రోత్సాహపరుస్తున్నట్లు నా వైపు చూసేవాడు. ముదురు ఊదారంగు పొడవైన అంగీ ధరించిన ఈ వ్యక్తి మూర్తీభవించిన శోకాధిపతి అని పిలువబడే వ్యక్తి అని ఆ తర్వాత తెలుసుకున్నాను.

ప్రగాఢమైన ఆ అనుభవాన్ని, అనిర్వచనీయమైన ఆ వాస్తవాన్ని నా ఇతర భావాలు నా మనోఫలకంపై ప్రకటింపజేసిన వైనాన్ని ఇలా వివరించవచ్చు.

చాలాసార్లు రాత్రి, పగలూ కూడా నేను లేక నా చైతన్యమంతా నా హృదయంలో పూర్తిగా కేంద్రీకృతమైనట్లనిపించేది. అప్పుడు హృదయం ఒక అంగంగా ఉండేది కాదు. అది ఒక భావన కూడ కాదు. అది దివ్యమైన ప్రేమ, భావస్వరూపమై, శాశ్వతమైనటువంటి ఆ దివ్యప్రేమగా నేను సృష్టిలోని ప్రతిదానిలో కేంద్రస్థమై యున్న ఒక భావన కలిగేది. అదే సమయంలో అనంతమైన, అతి పెద్దవైన నా బాహువులను అవధిలేని ఆర్ద్రతతో సకల జీవులను చుట్టి పట్టుకొని, దరిచేర్చుకొని, విశ్వానికన్నా విశాలమైన నా అక్కున వారిని సేదతీర్చుతున్న భావన.... ఇవి చెప్పడానికి మాటలు చాలా నిస్సారమైనవి, వికారమైనవి. ఓ దివ్యప్రభూ! మానసికమైన ప్రతీకలు బాల్యచేష్టలుగా ఉంటాయి. కానీ నీ కోసమై నా ఆకాంక్ష నిరంతరమై, నిత్యమై యుంటుంది. నిజం చెప్పాలంటే ఈ శరీరంలో ఉన్నది నీవే, నీవు మాత్రమే ఉంటున్నావు. నిన్ను వ్యక్తం చేసే అపరిపూర్ణ సాధనం ఇది.

నీ తేజోపుంజపు ప్రశాంతతలో జీవులంతా సుఖసంతోషాలు పొందెదరు గాక!

22-2-1914

అనువాదకులు: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

మరిన్ని స్మృతులు

1

పద్దెనిమిది, ఇరవై సంవత్సరాల మధ్య వయస్సులో, దైవసాయుజ్యంతో ఒక సచేతన మరియు సుస్థిర ఏకత్వస్థితిని సాధించాను. ఏ మనిషి సాయమూ, గ్రంథం సాయమూ లేకుండానే ఒంటరిగా దాన్ని సాధించాను, అర్థమైందా! కొద్ది కాలం తరువాత వివేకానందుని 'రాజయోగం' పుస్తకం నా చేతి కొచ్చింది. అలా ఒకటి కన్పించినపుడు నాకు వివరించి చెప్పడానికి ఇక్కడొకటి వున్నదని, అదొక అద్భుత విషయంగా అని పించింది. బహుశా నా అంతట నేను సాధించడానికి సంవత్సరాలు పట్టేదాన్ని కొద్ది నెలలలోనే ఆ పుస్తకం వల్ల సాధించగలిగాను.

నేనో వ్యక్తిని కలుసుకొన్నాను. అప్పుడు నాకు ఇరవై ఒక్క సంవత్సరాలు — ఇరవైగాని, ఇరవై ఒకటి గాని వుంటాయనుకొంటాను. ఆ వయస్సులో ఒక భారతీయుడిని కలుసుకొన్నాను. అతడు ఇక్కడి (భారతదేశం) నుండి వచ్చాడు. గీతను గురించి చెప్పాడు. తర్జుమా అంతగా బాగాలేని ఒక పుస్తకాన్ని నా కిచ్చి చదవమని సలహా యిస్తూ, దాన్నెలా చదవాలో అతనికి తెలిసిన కీలకాన్ని ఇలా చెప్పాడు. "గీతను చదవండి. గీత యొక్క ఈ అనువాదం అంతగా బాగా లేదు, అయినాగాని ఫ్రెంచి భాషలో వున్నది ఇదొక్కటే". ఆ కాలంలో ఏ ఇతర భాషలో వున్న దేన్నీ అర్థం చేసుకోగలిగేదాన్ని కాదు. అదీ గాక ఆంగ్లానువాదాలు ఏమీ బాగుండేవి కావు. పైగా అవేవీ నా దగ్గర లేవు... అప్పటి కింకా శ్రీఅరవిందులు వ్రాయలేదు.

అతడు "గీతను చదవండి. శ్రీకృష్ణుని, అంతర్యామి భగవంతునికి ప్రతీకగా భావించండి", అన్నాడు.ఆయన చెప్పినదంతా కలిపి ఇంతే. "కృష్ణుడు గీతలో అంతర్యామి భగవంతునికి, మీలో నున్న భగవంతునికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు,

అన్న జ్ఞానంతో మీరు గీతను చదవండి" అని చెప్పాడు. అంతే, ఒక్కనెలలో మొత్తం జరిగిపోయింది!

ఇహ ఇప్పుడు మీ విషయం, మీలో కొంతమంది బాల్యం నుంచే ఇక్కడున్నారు. ప్రతిదీ మీకు సవివరంగా అందించబడింది. మొత్తం పని మీ కోసం మాటలతోనే గాక, చైత్యసంబంధమైన సకల సహాయకాలతో, సాధ్యమైన అన్ని పద్ధతుల్లో, నమిలిపెట్టి అందించినట్లుగా మీ ముందు తయారుచేసి పెట్టబడింది. మీ అంతరంగపు ఆవిష్కరణకు దారితీసే మార్గం మీద మిమ్మల్ని నిలబెట్టాను. అయినప్పటికీ ఇంకా మీరు, అదెప్పుడు ప్రాప్తించాలో అప్పుడే ప్రాప్తిస్తుందిలే అన్నట్లు అలా అలా (సంజ్ఞ) జీవితాన్ని గడిపేస్తున్నారు. అసలు దాన్ని గురించి మీరు ఆలోచిస్తున్నారా?...

దాని అవసరాన్ని గురించి, "ఎలా తెలుసుకోవడం" అని తీవ్రంగా మీరు తపన పడడం లేదు అని తెలిసి ఆశ్చర్యపోతున్నాను. ఎందుకనంటే, మీకు చెప్పాం, మళ్ళీ, మళ్ళీ చెప్పాం, మీ చెవులు చిల్లులు పడేటట్లు చెప్పాం. మీకు తెలుసా, ఒక దివ్యచేతన మీలో వుంది, మీరు రాత్రులకు రాత్రులు నిద్రిస్తూ గడిపేస్తున్నారు, రోజులకు రోజులు ఆటలాడుతూ గడిపేస్తున్నారు. మీతో మీరు సంబంధం పెట్టుకోవడానికి, అవును, మీతోనే, ఇక్కడ లోలోపల (అమ్మ తమ యెదద మధ్య చూపిస్తారు) సంబంధం పెట్టుకోడానికి మీరు ఉత్సాహం చూపడం లేదు, తీవ్రంగా సంకల్పించడం లేదు.

ఇదిగో ఇది నిజంగా నాకు అంతు చిక్కకుండా ఉంది!

నేను శోధించి, ఆవిష్కరించుకొనవలసినది నాలోనే ఏదో వున్నదని మొట్టమొదటిసారి నాకు తెలిసినపుడు, అదే నాకు అత్యంత ప్రధాన విషయంగా అయ్యింది. అన్నింటికన్నా ముందు దీన్నే సాధించాలని లక్ష్యంగా పెట్టుకొన్నాను. నేను చెప్పినట్లు కేవలం ఒక చిన్న సూచన ఇవ్వటానికి "ఇదిగో నీవిలా చేస్తే నీ ముందు మార్గం తెరచుకొంటుంది" అని తెలిపేందుకు ఒక గ్రంథాన్నో, ఒక మనిషినో కనుగొన్నపుడు "ఎందికిలా ఆలస్యం" అని తలమునకలయ్యేటట్లు అందులో దూకాను. నన్నేదీ ఆపలేనట్లు, పెనుతుఫానులా దానిపై విరుచుకుపడ్డాను.

మేమేం చేయాలని ఇంతకు ముందు నన్నడిగిందెవరిక్కడ? బిడ్డా! ఇప్పుడు నేను చెప్పినదానినే నీవు చేయాల్సింది, సరేనా!

2

యదార్థంగా స్వేచ్ఛగా వుండాలంటే దైవానికి, ఎట్టి మినహాయింపులు లేకుండా, నీవు సంపూర్ణంగా సమర్పణ గావాలి. ఎందుకనంటే అప్పుడు బంధించేదంతా, గొలుసులతో కట్టిపడవేసేదంతా నీ నుంచి సహజంగానే జారిపోతుంది. దానికెంత మాత్రం ప్రాధాన్యత ఉండదు. ఎవరైనా వచ్చి నిన్ను నిందిస్తే "ఏ అధికారంతో అతడు వచ్చి నన్ను నిందిస్తున్నాడు, అతనికి సర్వోన్నత సంకల్పం యేమిటో తెలుసా?" అని ప్రశ్నించవచ్చు. నిన్ను అభినందించినపుడు గూడా అలాగే చేయాలి. ఇతరుల నుంచి నీకు లభించేదాని నుండి నీవు ప్రయోజనం పొందవద్దని, సలహా యివ్వడానికి కాదు నేనలా చెప్పడం. ఎందుకనంటే ఒక చిన్న బిడ్డ కూడా మనకు పాఠం చెప్పగలదనే విషయాన్ని నా మొత్తం జీవితకాలమంతా చూసి తెలుసుకొన్నాను. నీ కంటె అతడు తక్కువ అజ్ఞాని అని కాదు. నీ వంటే యేమిటో ప్రతిబింబించే అద్దం లాంటి వాడతడు. అతడు యదార్థం కాని విషయాన్ని దేన్నైనా చెప్పవచ్చు, కాని నీకు తెలియనిదాన్ని దేన్నో కూడా నీకు చూపవచ్చు. అవాంఛనీయ ప్రతిచర్య లేకుండా నీవు ఆ పాఠాన్ని స్వీకరిస్తే తద్వారా నీవు ఎంతో లాభం పొందవచ్చు.

నా జీవితంలోని ప్రతి ఘడియలోనూ, దేన్నైనా కొంత నేర్చుకోగలనని తెలుసుకొన్నాను. కాని ఇతరుల అభిప్రాయాలకు నేనెన్నడూ బందీని కాలేదు. దేన్నైనా తెలుసుకోగల ఒకే ఒక సత్యం ప్రపంచంలో వున్నదని నేను భావిస్తాను. అదే సర్వోత్కృష్ట సత్యం. అది గ్రహించిన యెవరైనా స్వేచ్ఛాజీవి అవుతాడు. ఇదిగో ఈ స్వేచ్ఛ — సమస్త సంగత్వం నుండి, అజ్ఞానం నుండి, ప్రతిచర్య నుండి మీరంతా స్వేచ్ఛ పొంది వుండాలని కోరుకొంటున్నాను. దైవానికి సంపూర్ణ సమర్పణ దక్క తక్కిన దానంతటి నుండి మీకు స్వేచ్ఛ వుండాలని నేను కోరుకొంటున్నాను.

3

...ఒకసారి చాలా కాలం క్రితం, నేనింకా పారిస్‌లోనే వున్నపుడు, దాదాపు ప్రతి రోజూ మేడమ్ డేవిడ్ నీల్‌ను కలుసుకొంటూండేదాన్ని. ఆమె పూర్తిగా స్వీయాభిప్రాయానికి కట్టుబడి వుండేది. "ఒక పని గురించి ఆలోచించ వద్దు. ఆలోచిస్తే దానర్థం పని మీద నీకు రాగం యేర్పడిందన్నమాట. ఏదైనా చేయాలనుకొంటున్నావంటే ఈ

ప్రాపంచిక విషయాలకు ఇంకా బద్ధురాలనై వున్నావని అర్థం" అని చెప్పేది. అప్పుడామెతో నేనిలా అన్నాను. "లేదు, ఏదీ తేలిక కాదు. ఇంతకు ముందు చేసి వున్నదాన్ని, ఇక ముందు చేయబోయేదాన్ని, ఇపుడు సంభవిస్తున్నదాన్నీ తలచుకోవడం మాత్రం చెయ్యి. అపుడు నీవు చేసే కర్మ, శాశ్వతత్వంలో ఓ సెకనులా ఈ విధంగా ఒక చిరు కదలిక అని గ్రహిస్తావు. అప్పుడు నీవు దానికి ఏమాత్రం బద్ధుడువు కావు". నేనలా చెప్పేనాటికి నాకు గీతావచనం గురించి తెలియదు. అప్పటికింకా దాన్ని పూర్తిగా చదువలేదు. గమనించావా.... (ఇక్కడ అమ్మ పలికిన కొన్ని మాటలు సరిగా విన్పించలేదు)... నాకు తోచిన రీతిని తర్జుమా చేసిన ఈ శ్లోకాన్ని కాదు "సమస్త కర్మఫలం మీద అపేక్ష లేకుండా విరాగివై కర్మ చెయ్యి". ఆ శ్లోకం ఇలా వుండదు గాని, దానర్థం అదే. ఇది నా కప్పటికి తెలియదు. కాని గీతలో ఏం చెప్పబడిందో అచ్చంగా అదే చెప్పాను.

కాని నీవు చేసే కర్మలో నీకు నమ్మక మున్నందువల్ల కాదు నీవు కర్మ చేస్తూండడం, చేస్తూండడం, నీవు కర్మ చేసేది ఎందుకంటే కర్మను తప్పక చేయాలి గనుక.

30-11-1955

4

అవును, నిజమే, సోమరితనం ఒక రకమైన తమస్సు. కాని సోమరితనంలో ఒక దుస్సంకల్పం వుంది, అది కష్టపడడాని కిష్టపడకపోవడం — కాని తమస్సు అంటే జడత, ఒక పని చేయాలనుకొంటాడు గాని చేయలేడు.

చాలా కాలం క్రిందట, కొంతమంది చిన్నవాళ్ళ మధ్య నేనున్నానని గుర్తుంది. నేను లేవాలనుకొన్నపుడు కూచున్న చోటు నుంచి ఒక్క ఉదుటున, ఏ కష్టమూ లేకుండా లేస్తున్నానని అంటూ వాళ్లు "అలా, యెలా చేయగలుగుతున్నారు, మేం కూచున్న చోటు నుండి లేవాలనుకున్నపుడు సంకల్పించి, ప్రయత్నించి, లేవవలసి వస్తోంది" అన్నారు. వాళ్ల కదెంతో ఆశ్చర్యం కలిగించింది. కాని, నాలా వాళ్ళ విషయంలో జరగడం లేదనేది నాకు ఆశ్చర్యం కలిగించింది. నాలో నేను "అదెలా సంభవం? ఎవరైనా లేవాలని నిశ్చయించుకొంటే, లేస్తారు," కదా అనుకొన్నాను. లేదు, దేహం అలా కూచొని వుంది. అందుచేత దాన్ని లేపి, పని కుపక్రమిం

చేందుకు దానిలో సంకల్పాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరం వుంది. అది అలా కదలకుండా వుండడమే తమస్సు. తమస్సు పూర్తిగా భౌతిక విషయం. ప్రాణిక లేక మానసిక తమస్సు అనేది చాలా అరుదు (అదీ రావచ్చు, కాని అది అంటువ్యాధిలా వచ్చేదే). అది ప్రాణిక లేక మానసికమైనదాని కన్నా నాడికి లేదా మస్తిష్క సంబంధమైనది. సోమరితనం అనేది సర్వే సర్వత్రా, భౌతికంలో, ప్రాణికంలో, మనస్సులో వున్నది. సర్వసాధారణంగా సోమరిజనం, ఎప్పుడూ సోమరులు కాదు, అన్నింటియెడల సోమరులు కాదు. వారికి సంతోషం కలిగించేదేదైనా, ఆనందం కలిగించేదేదైనా నీవు ప్రతిపాదించావనుకో, అపుడు వాళ్ళు కష్టించడానికి, చక్కగా సిద్ధమౌతారు. సోమరితనంలో చాలా దుస్సంకల్పం వుంది.

28-4-1951

5

ప్రశ్న: కలలను వ్రాసి పెట్టుకోవడం వల్ల ప్రయోజనం వుంటుందా?

అవును, వుంటుంది. సంవత్సరం పైగా ఈ విధంగా నేను చేసాను. ప్రతిదాన్నీ వ్రాసేదాన్ని — కొద్ది మాటలు, ఒక చిన్న విషయం, ఒక భావముద్ర — ఒకదాని తర్వాత మరొకటిగా గుర్తుకు దెచ్చుకొంటూ వెళ్ళేదాన్ని. మొదట్లో అవి పెద్దగా ఫలితాన్నివ్వలేదు. కాని పదునాలుగు నెలల తర్వాత చివరి నుండి ప్రారంభం వరకూ, అన్ని కదలికలనూ, రాత్రి మొదలైన దగ్గర్నుండీ వచ్చిన కలల నన్నింటినీ అనుసరించగలిగేదాన్ని. అది వ్యక్తిని సచేతనమైన, ఎప్పుడూ యెరుకతో వుండే చేతనాస్థాయిలో వుంచుతుంది. చివరకు నేను అసలు నిద్ర పోకుండా వుండే స్థితికి చేరాను. నా దేహం పరుచుకొని పడుకొని వుండేది, గాఢనిద్రలో పడిపోయేది. కాని చేతనలో విశ్రాంతి వుండేది కాదు. ఫలితం మహాద్భుతం. విభిన్న నిద్రాస్థితుల యెరుక ఉండేది. నిద్రలో జరిగే ప్రతిదీ అతి చిన్న వివరంతో సహా పూర్తిగా యెరుకలో వుండేది. అప్పుడు అదుపులో లేకుండా ఏదీ తప్పించుకోలేదు. కాని పగటిపూట నీవు చేయవలసిన పని యెక్కువగా వుంటుంది. నిజంగా నీకు నిద్ర అవసరమంటే నేను చెప్పినదానికై ప్రయత్నించవద్దని నా సలహా.

ఏదేమైనప్పటికీ పూర్తిగా అనివార్యమైన విషయం ఒకటుంది. నీవు మేలుకొనే టప్పుడు ఎటువంటి చిన్న కదలిక లేకుండా చూసుకొని మేలుకో. ఏమాత్రం కదల

కుండా మేలుకోవడం నేర్చుకో, అలా కాకపోతే ఏదీ గుర్తుండదు.

నిద్ర అనే మాటకు[1] ఉన్న అర్థంలో నేను చాలా కాలం నిద్రపోలేదన్న విషయం నిజమే. అంటే సాధారణ నిద్రకు చిహ్నమైన నిశ్చేతనలో పడిపోవడం ఎప్పుడూ జరుగలేదు. కాని నేను నా దేహానికి అవసరమైన విశ్రాంతి నిచ్చాను. అంటే మానసిక, చైత్యసంబంధ, ప్రాణిక మరియు భౌతికం వరకూ గల మొత్తం అస్తిత్వం విశ్రాంతి తీసుకోగల సంపూర్ణ నిశ్చలతకు సంబంధించిన ఒకానొక స్థితిలో రెండు మూడు గంటల పాటు పడుకోబెట్టి వుంచేదాన్ని. పరిపూర్ణ శాంతి, సంపూర్ణ నిశ్చల నీరవత, పూర్తి నిశ్చలత లోనికి అది ప్రవేశించేది. కాని, అదే సమయంలో చేతన పూర్తిగా మేలుకొని వుండేది. లేని యెడల నేను అస్తిత్వపు ఒకటి రెండు స్థితులలో గుప్తకార్యానికి సంబంధించిన ఆంతరికమైన కార్యకలాపంలోనికి ప్రవేశించేదాన్ని. అదంతా పూర్తి యెరుకతో జరిగేదని చెప్పవలసిన అవసరం లేదు. కాబట్టి ఇరవై నాలుగు గంటల్లో ఎప్పుడూ గూడా నేను చేతనను కోల్పోయేదాన్ని గాదని ప్రమాణం చేసి చెప్తున్నాను. అందుకని అది పరంపరగా సాగే అవిరామ స్థితిని కల్పించింది. అదీ గాక సాధారణంగా చెప్పుకొనే నిద్ర అనుభవం నాకు ఎంత మాత్రం లేదు. అదే సమయంలో నా దేహాని కవసరమైన విశ్రాంతి నిస్తూండేదాన్ని.

3-7-1927

6

ప్రశ్న: భౌతికదేహం, భౌతిక మస్తిష్కం విషయం అటుంచి, మనస్సుకు విశ్రాంతి తీసుకోవలసిన అవసరం వుందా?

అవును, వుంది. ఆ అవసరం తప్పకుండా వుంది. నిశ్చల నీరవతలోనే మనస్సు యదార్థ వెలుగును, పైనుండి స్వీకరిస్తుంది. మానసిక అస్తిత్వం అలసిపోతుందని నేననుకోను. అలసిపోయి నట్లనుభూతి చెందితే యెక్కువగా అది మెదడుకు సంబంధించిన ఒక ప్రతిక్రియ. కేవలం నిశ్చలనీరవతాస్థితిలోనే అది తనను దాటి పైకి లేవగలదు. మనం మాట్లాడుకొంటున్నా నిద్ర, కలలు దృక్కోణం నుండి చూస్తే చెప్పుకోదగ్గ విషయం ఒకటి కన్పిస్తుంది. నేను దాన్ని ప్రయత్నించాను. నీ బుర్రలో

[1] అనేక నెలల పాటు దివ్యజనని నిద్ర పోలేదు అని ఒక వార్తాపత్రికలో వ్యాసం ప్రచురించబడినపుడు ఈ సమాధానం ఇచ్చారు.

మాత్రమే నిశ్చల నీరవత గాకుండా, నీ ప్రాణికంలో విశ్రాంతిని పాదుకొల్పగలిగితే, నీ అస్తిత్వపు సకల కార్యకలాపాలను ఆపివేయగలగి, రూపాలకు సంబంధించిన పరగణా నుండి బయటపడి, సచ్చిదానందమని పిలువబడే, సర్వోత్కృష్ట చేతనలో ప్రవేశించితే అప్పుడు యెనిమిది గంటల నిద్రలో లభించే విశ్రాంతిని, ఆ స్థాయిలో మూడు నిముషాల్లోనే పొందగలుగుతావు. అది అంత తేలిక కాదు గదా... అది పూర్తిగా సచేతనమైన చేతన, కాని అది సంపూర్ణమైన, సమృద్ధమైన దివ్యవెలుగులోని, నిశ్చల నీరవతాస్థితి. దాన్ని నీవు పొందితే, నీ లోని ప్రతిదాన్నీ నిశ్చలం చేయగలిగితే, అప్పుడు నీ సమస్త అస్తిత్వం ఈ సర్వోత్కృష్ట చేతనలో పాలు పంచుకొంటుంది. విశ్రాంతి దృష్ట్యా (విశ్రాంతి అంటే దైహిక విశ్రాంతి, కండరాల ఆటవిడుపు అని నా భావం) సాధారణ యెనిమిది గంటల నిద్రకు, ఆ స్థితికి సంబంధించిన మూడు నిముషాలు సమానం.

27-1-1951

8

...ఇంగితజ్ఞానం తక్కువగా వున్న మనుషులు... ఇక్కడికొచ్చి (ఆశ్రమానికి వచ్చి) వెళ్ళినా, ఇక్కడ నివసించినప్పటికీ, ఇతర చోట్ల ఇక్కడున్న వాతావరణం భిన్నంగా వుందని గ్రహించలేరు. ఈ విషయాన్ని అనుభూతి చెంది, సరైన విధంగా నొక్కి వక్కాణించగలిగినవారు మీలో ఎవరున్నారు? మీ హృదయంలో, మీ భావనలో ఆ మాదిరిగా లేదు అని మీరు అనుకోవచ్చు. కాని అది చాలా అస్పష్టంగా వుంటుంది, కాదా? కాని ఈ ఖచ్చితమైన అవగాహన ఉండాలంటే... వినండి, నేను జపాను నుండి వస్తున్నప్పుడు నాకు అన్పించినట్లు మీకు అన్పించిందా? నేను సముద్రంలో నావ మీదున్నాను. దేన్ని కావాలనుకోవడం లేదు. (నేను ఆంతరిక జీవితంతో తీరిక లేకుండా వున్న మాట నిజమే) కాని నావ మీదున్నాను. అపుడు ఆకస్మికంగా, అప్పటి కప్పుడు, పాండిచేరి నుండి రెండు నాటికల్ మైళ్ళ దూరంలో వాతావరణం యొక్క, వీచే గాలియొక్క భౌతిక లక్షణం మారిపోయింది, ఎంతగా మారిపోయిందంటే మేం శ్రీఅరవిందుల తేజోవలయంలో ప్రవేశిస్తున్నామని తెలిసేంతగా మారిపోయింది. అదొక భౌతికానుభవం, ఎవరైనా సరే, జాగృత చేతన కలిగిన వారెవరైనా సరే, అదే అనుభూతికి లోనవుతారని దృఢంగా చెప్పగలను.

ఇచట చాలా చాలా సంవత్సరాలున్న తరువాత మొట్టమొదటసారి కారులో బయటకు వెళ్ళినపుడు, దీనికి విరుద్ధమైన అనుభవం కలిగింది. సరస్సు కావలగా కొద్ది దూరానికి వెళ్ళినపుడు అకస్మాత్తుగా వాతావరణం మారుతున్నట్లు గ్రహించాను. అక్కడ నిండుదనం, శక్తి, వెలుగు, క్రియాశక్తి అన్నీ క్షీణించాయి, పూర్తిగా క్షీణించి పోయాయి. అప్పుడు... ఇంకేమీ లేదు. నేను మానసిక లేక ప్రాణిక చేతనలో లేను, పూర్తిగా భౌతిక చేతనలో వున్నాను. తమ భౌతిక చేతనలో సున్నిత అవగాహన ఉన్నవాళ్ళు దాన్ని అత్యంత ఘనిష్టంగా సంవేదించితీరక తప్పదు. అందుచేత 'ఆశ్రమం' అని మనం పేరు పెట్టుకొన్న ఈ ప్రదేశంలో ఘనీభవించిన క్రియాశక్తి — అది పట్టణంలో వున్నదాని వంటిదిగాని, అంతకన్న తక్కువగా ఉండే పల్లెప్రాంతపు వంటిదిగాని కాదు — వున్నదని ధృవీకరించి చెప్తున్నాను.

9

దీన్నంతా అలా చూచినపుడు, గతంలో జరిగిన ఒక విషయం గుర్తుకొచ్చింది. అది 1926 అని సరిగానే గుర్తు పెట్టుకొన్నా ననుకొంటున్నాను.

శ్రీఅరవిందులు అతిమానస చేతన యొక్క అభివ్యక్తిని వేగవంతం చేసేందుకు ఏకాగ్రత వహించేందుకు, ఏకాంతం లోనికి ఉపసంహరించుకొనా లనుకొన్నందున బాహ్య కార్యకలాపానికి సంబంధించినంతవరకు బాధ్యతను నా కప్పగించారు. అక్కడున్న కొద్దిమంది ముందు, వారికి సాయం చేయడం, మార్గ నిర్దేశం చేయడం అనే పనిని నా కప్పగించినట్లు, నేను వారితో సహజంగానే సంబంధం కలిగి వుంటాననీ, నా ద్వారా తాము పనిచేస్తుంటామనీ ప్రకటించారు. ఆ వెనువెంటనే, అకస్మాత్తుగా, విషయాలన్నీ ఒక నిర్దిష్ట ఆకారం దాల్చాయి. అత్యంత ప్రజ్ఞాపాటవాల సృష్టి, అసాధారణమైన వివరాలతో అత్యద్భుత అనుభవాలతో, దివ్యజీవులతో సంబంధాలతో మహామహిమోపేతమైన వనబడే సర్వవిధ అభివ్యక్తులతో తయారైంది. ఒకదానిపై మరొకటిగా అనుభవ పరంపర కొనసాగింది. తేజోవంతంగా విషయాలు అత్యంత ఆసక్తి కలిగించే విధంగా బయటపడ్డాయని చెప్పక తప్పదు.

ఒక రోజున ఏం జరుగుతున్నదో, శ్రీఅరవిందులకు వివరించడానికి వారి దగ్గ రకు వెళ్ళాను. నిజంగా చాలా ఆసక్తి కలిగించే దశ దగ్గరకు మేం చేరుకొన్నాం. ఏం జరిగిందో చెప్పే పద్ధతిలో బహుశా నేను కొంచెం ఉత్సాహం చూపించి

ఉంటాను. అప్పుడు శ్రీఅరవిందులు నా వంక చూసి... "అవును, ఇది అధిమనస్సు సృష్టి. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. చాలా బాగా జరిగిందది. మొత్తం ప్రపంచంలో నిన్ను అత్యంత ప్రసిద్ధురాలిని చేసే మహిమలను చేయగలుగుతావు. పృథ్విపై సకల సంఘటనలను తలక్రిందులు చేయగలుగుతావు" అని, నవ్వి, "అదొక మహా విజయం అవుతుంది, కాని అది అధిమనస్సు సృష్టి. అదీగాక మనం కోరేదీ విజయాన్ని కాదు, పృథ్విపై అతిమనస్సును ప్రతిష్ఠించాలని కోరుతున్నాం. నూతన ప్రపంచాన్ని సృజించేందుకు, సమగ్ర అతిమానస ప్రపంచాన్ని సృజించేందుకు, వెనువెంటనే లభించే విజయాన్ని త్యజించడం యెలాగో తెలుసుకోవాలి". నా ఆంతరిక చేతనతో వెంటనే అర్థం చేసుకొన్నాను. కొద్దిగంటల తర్వాత ఆ సృష్టి వెళ్ళిపోయింది... ఆ క్షణం నుండీ ఇతర పునాదులపై క్రొత్తగా ప్రారంభించాం

10-7-1957

10

మహిమల కోసం, అద్భుతాల కోసం చూచే మానవ కోరికను నేను సంతృప్తి పరచ లేను. ఒకప్పుడు అలా నేను చేయగలిగాను, చేసి చూపించాను. కాని అందుకోసం తప్పకుండా ప్రాణిక చేతనలో నివసించాలి, ప్రాణిక క్రియాశక్తుల నుపయోగించాలి. అదేమంత మంచి పని కాదు.

23-1-1952

11

అది జరిగిందెప్పుడో నాకు సరిగా గుర్తు లేదు. బహుశా 1920 సంవత్సరంలో ననుకుంటాను. (బహుశా ఇంకా ముందు అంటే 1914-15 లో కావచ్చు, కాని అలా అనుకోవటం లేదు, అది 1920 లో ఎప్పుడో జరిగి వుంటుంది.) ప్రతి రోజూ, నేను శ్రీఅరవిందులతో పాటు ధ్యానం చేస్తూండేదాన్ని. వరండాలో బల్లకొక చివర వారు కూర్చొనేవారు. అదే బల్లపై మరో చివర నేను కూర్చొనేదాన్ని. ఒక రోజు, ఇలా ధ్యానంలో ప్రవేశించాను, (ఎలా చెప్పాలి) ఎంతో ఎత్తుకు వెళ్ళాను, బాగా లోతుకు పోయాను లేదా నాలో నుండి నేను బయటికొచ్చాను. (ఎవరేం చెప్పినా ఎలా చెప్పినా, జరిగినదాన్ని సరిగా చెప్పలేరు. ఇవన్నీ కేవలం చెప్పే పద్ధతులు.)

నేనొక ప్రదేశానికి చేరుకొన్నాను. అచటి నుండి శ్రీఅరవిందులతో యథాలాపంగా, చాలా తేలిగ్గా "భారతదేశం స్వతంత్ర దేశమైంది" అన్నాను. అది 1920 లో. అప్పుడు వారిలా ప్రశ్నించారు "ఎలా?" నా సమాధానం "ఏ విధమైన పోరాటం లేదు, యుద్ధం లేదు, తిరుగుబాటు లేదు. ఆంగ్లేయులు వాళ్ళంతట వాళ్ళే దేశాన్ని విడిచి వెళ్ళిపోతారు, ఎందుకనంటే వెళ్ళిపోవడం కంటే వాళ్ళు మరేం చేయలేని విధంగా ప్రపంచ పరిస్థితి తయారైంది!"

అదే జరిగింది. వారు ప్రశ్నించినపుడు నేను భవిష్యత్తును గురించి మాట్లాడాను, కాని నేను దర్శించిన చోట, భారతం స్వతంత్ర దేశం అని చెప్పాను. అక్కడది ఒక వాస్తవం. అప్పటికి అంటే 1920 నాటి భారతదేశం స్వతంత్రదేశం కాదు. అయినా అది అచట స్వతంత్ర దేశం కావడం జరిగిపోయింది. ఇక్కడ అది 1947 లో జరిగింది. అంటే, భౌతిక దృక్పథం నుండి చూస్తే, నేను దానిని 27 సంవత్సరాలకు ముందే దర్శించానన్న మాట. కాని అది జరిగింది అలాగే.

29-7-1953

ప్రశ్న: మీరు శ్రీఅరవిందులతో "భారతం స్వతంత్ర దేశమైంది" అని చెప్పారు. భారతదేశం మొత్తం ఒకటిగానే వుందా లేక ఇప్పుడున్నట్లు రెండుగా విభజించబడిందా?

ప్రత్యేకించి 1947 లో ఏం జరిగిందో దాన్నే నేను ఉటంకించాను. అంటే పరాయిపాలన తొలగిపోవడం గురించే మాట్లాడాను. ఇంకదేన్నీ కాదు, దాని గురించే. ఆమె నైతిక లేదా ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని గురించి ఏమాత్రం మాట్లాడలేదు. ఆమె పరాయిపాలన నుండ స్వేచ్ఛ పొందింది అని మాత్రమే చెప్పాను.

18-1-1956

12

ఆలోచనా నియంత్రణ గురించిన అభిభాషణ

అదొక విస్తారమైన పరిధికి చెందింది. ఏమాత్రం నియంత్రణలేని స్థాయి. ఈ స్థితికే చాలామంది చేరుకొంటారు. వాళ్ళ ఆలోచనలే వాళ్ళను నియంత్రిస్తాయి గాని, వాళ్ళు తమ ఆలోచనలను నియంత్రించ లేరు. వదలించుకోలేని ఆలోచనలతో జనాభాలో చాలామంది సతమతమౌతుంటారు. అవి వారిని అక్షరాలా తమ వశం

చేసుకొని వుంటాయి. ఈ ఆలోచనలకు తమ సక్రియమైన చేతనకు సంబంధించిన ద్వారాన్ని మూసివేసే శక్తి వారి కుండదు. వారి ఆలోచనలే వారిని పాలిస్తాయి, నియంత్రిస్తాయి. "ఓహ్, ఆ ఆలోచన, ఎప్పుడూ నన్ను వెంటాడుతూనే ఉంది, తిరిగి తిరిగి వేధిస్తూనే ఉంది, దాన్ని వదలించుకోలేక పోతున్నాను." అని ప్రతి రోజూ జనం అనడం నీవు వినే వుంటావు. అంటే ఆరాటం నుండి, దుస్సంకల్పం, భయం వరకూ గల అనేక రకాల ఆలోచనలతో వాళ్ళు ముట్టడికి లోనవుతున్నారన్న మాట. భయోత్పాతం కలిగించే ఆలోచనలు చాలా బాధిస్తాయి. నీవు వాటిని నెట్టి వేయడానికి ప్రయత్నిస్తే అవి సాగదీసి విడిచిన రబ్బరు బాండ్ లా తిరిగి నీ మీదే పడ్తాయి. నియంత్రణ ఎవరికుంది? దానికి సంవత్సరాల తరబడి కృషి కావాలి, అంత సుదీర్ఘమైన అభ్యాసం కావాలి. కాబట్టి, సంపూర్ణమైన నియంత్రణ కాకపోయినా, ఏదో విధమైన దాని దగ్గరకు రావడం అనేది ఎలాగైనా ఒక స్థాయిని తెలియజేస్తుంది. ఇది చేయడానికి నీ బుర్రలో శక్తిసామర్థ్యం వుంటే (అమ్మ తమ నుదుటి మీదుగా చేయి కదిపి చూపిస్తారు) సమస్త కదలికలను లేకుండా చేసే, ప్రకంపనాలను నిలువరించే స్థాయికి చేరుకొంటావు. మానసిక ఉపరితలం మృదువుగా తయారవుతుంది. నీవొక పుస్తకాన్ని తెరచినపుడు ఒక ఖాళీ పేజీ తెరుచుకొంటే వున్నట్లుగా దాదాపు భౌతికంగా, అర్థమైందా,... ఆలోచన లేమీ లేకుండా ఖాళీగా అవుతుంది!

ఇంటి దగ్గరున్నప్పుడు కొంచెం ప్రయత్నించు. చాలా ఆసక్తి కలిగించే విషయం ఇది అని నీకే తెలుస్తుంది.

ఆలోచనలతో యిబ్బంది పడ్తున్నానని ఎవరో చెప్తే శ్రీఅరవిందులు అతని బుర్రలో ఇలా చేస్తుంటే నేను చూసాను. అతని బుర్రలో నల్లగా వుండి తైతక్కలాడు తున్న చిన్న బిందువు దగ్గరకు చేరేటట్లు వారి చేయి సాగి ఇలా చేసింది. (వ్రేళ్ళ కొనలతో సంజ్ఞ చేసి చూపిస్తూ) ఒక క్రిమిని పట్టుకొన్నట్లు దాన్ని పట్టుకొని దూరంగా విసిరేసారు. అంతే, మొత్తం నిశ్చలం, ప్రశాంతం, తేజోమయం....ఇలా అది స్పష్టంగా కన్పించింది తెలుసా, ఏం మాట్లాడకుండా దాన్ని బయటకు తీసిపారేసారు — దాంతో అంతా సద్దుమణిగింది.

విషయాలు చాలా సన్నిహితంగా పరస్పర ఆధారితాలై వుంటాయి. ఎక్కడో తీవ్రమైన బాధతో ఒకరు "ఇక్కడ నొప్పెడుతోంది! అబ్బా! ఇక్కడ బాధ కలుగుతోంది! అబ్బా!" అంటూ వారి దగ్గర కొచ్చిన మరో సంఘటన కూడా నేను చూసాను.

వారేం మాట్లాడలేదు, ప్రశాంతంగా వున్నారు, ఆ వ్యక్తి వంక చూసారు. సూక్ష్మభౌతిక హస్తం లాంటిదేదో, బయటకి వచ్చి ఇటూ అటూ చిందర వందరగా, అస్తవ్యస్తంగా నాట్యం చేస్తున్న చిన్న బిందువును పట్టుకొని, ఇలా తీసి (అదే సంజ్ఞ) అలా పారేసారు. అంతే, దాంతో అంతా నెమ్మదించింది.

"ఆహా, ఆహా నా బాధ పోయింది చూడండి."

8-1-1958

13

శ్రీఅరవిందులతో పాటు యోగసాధనలో, మనస్సు నుండి ప్రాణికంలోనికి దిగడం మొదలుపెట్టినపుడు, మనస్సు నుండి ప్రాణికంలోనికి మా యోగసాధనను నెలలోనే మార్చినపుడు, నా వయస్సు 40 సంవత్సరాలు. నేను అంత వయస్సున్న మనిషిలాగ గాక, చిన్నదానిగా కన్పించాను. అలా కన్పించినప్పటికీ వయస్సు 40 సంవత్సరాలే. ఒక నెల యోగసాధన తర్వాత సరిగ్గా 18 సంవత్సరాల అమ్మాయిలా కన్పించాను. అంతకు ముందు నన్ను చూసివున్న ఒకరు, నాతో పాటు జపానులో నివసించి ఇప్పుడిచటి కొచ్చిన ఒకరు, నన్ను గుర్తు పట్టడానికి యిబ్బంది పడ్డారు. అతడు "నిజంగా మీరేనా?" అని అడిగితే నేను "స్పష్టంగా" అని చెప్పాను.

ప్రాణికంలో నుండి భౌతికంలోనికి దిగినప్పుడు మాత్రమే అది పోయింది. ఎందుకనంటే భౌతికంలో పని చాలా కఠినతరం, పైగా అక్కడ పరివర్తన చేయవలసినవి చాలా చాలా వుండడమే అందుక్కారణం.

25-8-1954

ఎ.బి. పురాణి ఇలా అంటారు

1921 లో నా పర్యటన సందర్భంలో అత్యంత మహనీయమైన ఆశ్చర్యకరమైన విషయం శ్రీఅరవిందుల "దర్శనం". రెండు సంవత్సరాల కాలంలో వారి దేహరూపాం తరీకరణం జరిగింది. దాన్ని మహాద్భుతం అని మాత్రమే వర్ణించగలం. (మోము కాంతివంతంగానూ, చూపు చొచ్చుకుపోయేటట్లు అదివరకే ఉన్నప్పటికీ) 1918 లో వారి దేహం సాధారణ బెంగాలీ దేహఛాయలో ఉండేది, ఎక్కువగా నలుపు.

వారిని దర్శించడానికి మేడ పైకి వెళ్ళినపుడు, వారి చెక్కిళ్ళు యాపిల్

పింక్ రంగుతోనూ, మొత్తం దేహం మృదువైన మీగడ లాంటి తెల్లని వెలుగుతోనూ మెరుస్తూండడం చూసాను. ఆ మార్పు ఎంతో గొప్పగానూ, అనూహ్యంగానూ వుండి, అది చూసి "మీ కేమైంది?" అని ఆశ్చర్యంతో అనకుండా ఉండలేకపోయాను.

...తరువాత మాటల సందర్భంలో ఉన్నతతర దివ్యచేతన, మానసిక స్థాయికి దిగివచ్చిన తర్వాత, ప్రాణికం లోనికి, దానికంటె దిగువకు సైతం దిగివస్తుంది. అప్పుడు నాడీవ్యవస్థలోనూ, భౌతిక అస్తిత్వంలోనూ కూడా రూపాంతరీకరణ జరుగుతుంది అని వివరించారు.

ఈ పర్యటనలో దివ్యమాతను ప్రప్రథమంగా దర్శించాను. మధ్యాహ్న భోజనానంతరం శ్రీఅరవిందులు మేడ పైకి వెళ్తున్నపుడు ఆమె మెట్ల పక్క నిలబడి ఉన్నారు. భూపరిధిలో లేని అటువంటి మహాద్భుత సౌందర్యాన్ని ఇంతకు ముందెన్నడూ చూడలేదు. అప్పటి ఆమె వయస్సు 37 సంవత్సరాలైనా, 20 సంవత్సరాల యువతిలా కన్పించింది.

14

(1958) ఫిబ్రవరి నెల 3 వ తేదీన జరిగిన అతిమానస అనుభవం తర్వాత కొద్ది రోజులకు ఇది జరిగింది. భౌతిక ప్రపంచంలోని సంగతులు ఎంతో దూరంగా పూర్తిగా అసంబద్ధంగా అనిపించే స్థితిలోనే ఇంకా వున్నాను. ఒక పర్యాటక బృందంవారు నా దగ్గరకు రావడానికి అనుమతి తీసుకొన్నారు. వాళ్ళొక రోజు ఆటస్థలంలో నేనుండగా అచటికి వచ్చారు. వాళ్ళు బాగా సంపన్నులు, అంటే వాళ్ళు బ్రతకడానికి కావలసినదాని కంటే చాలా యెక్కువ డబ్బున్నవాళ్లు. వాళ్ళలో చీర కట్టుతో బాగా లావుగా వున్న ఒక స్త్రీ వుంది. ఆమె దేహం కన్పించకుండా వుండేటట్లుగా ఆమె చీర ధరించింది. నా ఆశీస్సులు స్వీకరించడానికి ఆమె వంగినపుడు చీర ఒక ప్రక్కకు తొలగింది. ఆమె దేహపు కొంత భాగం, పొట్ట నగ్నంగా కన్పించింది. అది చాలా పెద్ద పొట్ట. నేను నిజంగా దిగ్భ్రాంతి చెందాను.... అసహ్యంగా కనుపించని స్థూలకాయు లున్నారు. కాని ఈ పొట్ట దాచిపెట్టిన భ్రష్టతను, శోచనీయ స్థితిని అకస్మాత్తుగా చూసాను. పేరాశను, కల్మషబుద్ధిని, భ్రష్టశీలతను, ఏ జంతువూ పొందనటువంటి సంతృప్తి పొందే తుచ్ఛ కోరికను వ్యక్తం చేసే ఒక పెద్ద వ్రణంలాగా వుందది. దుశ్చింతనగల ఒక మనస్సుకు సంబంధించిన కుటిలత్వాన్ని చూసాను.

అపుడు అకస్మాత్తుగా నాలో నుండి ఏదో బయటకు ఎగిరిపడింది, వేదంలా ఒక ప్రార్థన "ఓ ప్రభూ, కనపడకుండా ఉండాల్సింది ఇదే" అని వెలువడింది.

19-3-1958

15

ఈ పై పై విషయాల్లో ఆకట్టు కొనేదేం లేదు. అవి నాకు అధికాధికంగా సబ్బు బుడగల్లా కన్పిస్తున్నాయి. ముఖ్యంగా 1958 ఫిబ్రవరి 3 వ తేదీ నుండి అలా కన్పిస్తున్నాయి.

నిర్వేదంతో, కన్నీళ్ళతో మనోపరిధికి సంబంధించిన బాధతో నా దగ్గరకొచ్చే వాళ్ళున్నారు. ఇలా నేను వారి వంక చూసినపుడు, మిమ్మల్నందర్నీ తనలో నిలిపి వుంచుకొనిన నా చేతన యొక్క ముల్లును కొంచెం ప్రక్కకు జరుపుతాను. వాళ్ళు వెళ్ళే సమయానికి పూర్తి ఓదార్పు పొందుతారు. దిక్సూచిలో వున్న ముల్లు లాంటిదది. చేతనలో ఆ ముల్లును కొంచెం జరిపితే చాలు, అంతా చక్కబడుతుంది. నిజమే, అది అలవాటు మూలంగా వెనక్కు జరుగుతుంది. అవన్నీ సబ్బు బుడగలు తప్ప మరేం కాదు.

బాధ పడడం కూడా నాకు తెలుసు. కాని దాని వెనుకగా, ఎడంగా, ఎలా నిలబడాలో తెలిసిన ఒక భాగం నాలో ఎప్పుడూ వుండనే వుంది.

ప్రపంచంలో భరించలేనిదంటూ ఇప్పుడు నాకు కన్పించే ఒకే ఒక విషయం ఏమంటే భౌతిక దిగజారుడుతనం, బాధ, నైచ్యం ప్రతి జీవిలోనూ ఉన్న సౌందర్యాన్ని వ్యక్తం చేయలేని అసమర్థత. కాని ఏదో ఒక రోజున అది కూడా జయించబడుతుంది. అక్కడ కూడా ఆ ముల్లును కొంచెం జరపడానికి శక్తి తప్పక వస్తుంది. మనం చేయవలసిందల్లా చేతనలో ఉన్నతస్థాయికి ఎదగడమే. పదార్థం లోనికి బాగా లోతుగా వెళ్ళాలనుకొంటే, చేతనలో అతడు బాగా పైకి ఎదగవలసిన అవసరం యెంతైనా ఉంది. అందుకు సమయం పడ్తుంది. దానికి కొన్ని శతాబ్దాలు పడ్తుందని శ్రీఅరవిందులు యదార్థమే చెప్పారు.

19-2-1958

16

మన ప్రపంచానికి, అతిమానస ప్రపంచానికి మధ్య నున్న భేదాన్ని గూర్చి ఇప్పుడు చెప్పవలసి ఉన్నట్లు కన్పిస్తోంది. అందుచేత ఆ విషయాన్నే ఇప్పుడు నొక్కి చెపుతున్నాను. అది కూడా నేను అచటికి సచేతనంగా, ఇక్కడ మామూలుగా కార్యం నిర్వహించే చేతనతో వెళ్ళిన తర్వాత మాత్రమే తెలిసింది. ఈ భేదం ఎంత పెద్దదో, అప్పుడు స్పష్టమైంది. చెప్పాలంటే ఇచట ప్రతిదీ, అంతరంగంలో బాగా లోలోతుల్లో జరిగేదాన్ని మినహాయించి, మిగతాదంతా కృత్రిమమైనదిగా కన్పిస్తోంది. సాధారణ భౌతిక జీవితం యొక్క విలువల్లో ఏదీ కూడా సత్యం మీద ఆధారపడి లేదు. మనల్ని దుస్తులతో కప్పుకొనేందుకు, ఏదైనా బట్ట దెచ్చుకొని, వాటిని దుస్తులుగా కుట్టుకొని అవసరమైనపుడు ధరిస్తాం. అలాగే మనల్ని మనం బ్రతికించుకొనేందుకు ఆహారాన్ని బయటి నుంచి తెచ్చుకొనవలసిన అవసరం ఉంది. పోషణ కోసం దానిని శరీరానికి అందిస్తాం. అలా ప్రతి విషయంలో మన జీవితం కృతకమే....

ఈ కృతకత్వం, కాపట్యం, ఈ అసత్య స్థితి నాకు చాల దిగ్భ్రాంతి కలిగిస్తు న్నాయి... ఇంత అసత్యం వున్న ప్రపంచంలో యదార్థ విలువ లేమైనా తెలుస్తాయా అని ఆశ్చర్యం కలుగుతుందెవరికైనా.

నిన్ను విచారగ్రస్తుడిగా, తిరగబడేవాడిగా, అసంతృప్తుడుగా చేసే బదులు, నేను చివరికి చెపినట్లుగా, ఒక హాస్యాస్పదమైన నవ్వు తెప్పించే భావన ఒకటి కలి గింది. ఏలాగంటే, చాలా రోజుల వరకు మనుషులను, విషయాలను గమనించినపుడు, అవి అసంబద్ధంగా ఉన్నాయని నాకు తప్ప ఇతరులకు అర్థం గాని, వాటిని గమనించి నప్పుడు ఆపుకోలేని నవ్వు వచ్చేది.

19-2-1958

అనువాదం: కె. వి. రావు

అతిమానస అవతరణ

1

25 సెప్టెంబరు 1914

ఓ దివ్యమాతా, ఆరాధ్య దైవమా, నీ సహాయంతో అసంభవం అనేది ఏదైనా ఉంటుందా? సాక్షాత్కార సమయం ఆసన్నమైంది. పరమాత్మ ఇచ్ఛను సమగ్రంగా నిర్వహించ గలందులకై నీవు సహాయం చేస్తావని మాకు అభయం ఇచ్చావు.

ఆలోచించలేని వాస్తవికతలకు, భౌతిక ప్రపంచపు పరస్పర సంబంధాలకు సమర్థులైన మధ్యవర్తులుగా మమ్ములను నీవు అంగీకరించావు. మా మధ్య నీ నిరంతర సన్నిధి నీ క్రియాపూర్వక సహకారానికి సంకేతం.

ప్రభువు సంకల్పించాడు, నీవు నెరవేర్చాలి.
ఒక నూతన దివ్యకాంతి భూమి మీద మెరవాలి.
నూతన ప్రపంచం ఆవిర్భవించాలి,
చేసిన వాగ్దానాలన్నీ ఈడేరాలి.

2

29 ఫిబ్రవరి 1960 సందేశం:

29 ఫిబ్రవరి 1956

బుధవారం సామూహిక ధ్యానసయంలో

ఈ సాయంత్రం దైవసన్నిధి ఎంతో స్పష్టంగా వాస్తవమై, భౌతికంగా మీ మధ్య నున్నది. కొత్త ప్రపంచం జన్మించింది: వాగ్దానం నెరవేరింది.

దైవసన్నిధి ఎంతో స్పష్టంగా వాస్తవమై, భౌతికంగా మీ మధ్య నున్నది. నేను ఒక బంగారు రూపం ధరించి ఉన్నాను. అది ఈ విశ్వం కంటె పెద్దది. ప్రపంచాన్ని, దైవాన్ని వేరుచేస్తున్న ఎంతో దృఢమైన ఒక పెద్ద బంగారు తలుపు ఎదురుగా నేను నిలబడి ఉన్నాను.

నేనా తలుపును చూస్తూనే, విషయం తెలుసుకొని, ఇచ్ఛామాత్రంతో, చైతన్యం

నుంచి వచ్చిన ఒక కదలికతో 'సమయమాసన్నమైంది' అనే తలంపుతో, ఒక అత్యంత శక్తివంతమైన బంగారు సుత్తితో ఆ తలుపు మీద ఒక్క దెబ్బ కొట్టాను. ఆ ఒకే ఒక దెబ్బతో ఆ తలుపు ముక్కలై చెల్లాచెదరైపోయింది. అప్పుడు అతిమానస ప్రకాశం, మహాశక్తి, దివ్యచైతన్యం భూమి మీదకు అడ్డూ ఆపూ లేకుండా వరదలాగా కిందకు తోసుకువచ్చింది.

ఇది 1956 లో వ్రాయబడింది.

3

ఫిబ్రవరి 29,1956 న జరిగిన ఘటన, ఏదో అయినట్లుగా, ఒక దర్శనం లేదా ఒక అనుభవం లాంటింది కాదు. ఆటస్థలంలో సాయంత్రం ధ్యానసమయంలో నేను అతిమానసంలోకి ఆరోహించాను, ఏదో చేయవలసి ఉందనే అవసరాన్ని గుర్తించాను, అదే చేశాను.

అప్పుడు వినబడిన కొన్ని ఆసక్తిదాయకమైన మాటలను ఉటంకిస్తాను — "సమయం ఆసన్నమైంది" — ఆ మాటలు నేను ఏకకాలంలో తెలుసుకుని, ఇచ్ఛగించి నదానినే వ్యక్తపరచినాయి. ఆ మాటలు ప్రపంచాన్నుంచి వేరుచేసే ఒక దృఢమైన పెద్ద తలుపు ముందు నేను చేరి వున్న తరుణంలో వినబడినవి. అవి ఫ్రెంచి భాషలో కాక ఆంగ్లంలో వినబడినవి. అవి శ్రీఅరవిందులే మాట్లాడినట్లుగా తోచింది.

4

1956

29 ఫిబ్రవరి — 29 మార్చి

ఓ ప్రభూ, నీవు సంకల్పించావు, నేను నెరవేరుస్తాను:
ఒక నూతన కాంతి భూమి మీద మెరిసింది,
నూతన ప్రపంచం ఆవిర్భవించింది.
చేసిన వాగ్దానాలన్నీ ఈడేరినాయి.

5

అద్భుతమైన ఈ పరమాత్మ చైతన్యానికి భూవాతావరణం ఎంతో వ్యతిరేకతను

చూపించి, నిరంతరం దానిని పూర్తిగా మరుగున పడేస్తుంది. కాలక్రమంలో అప్పు డప్పుడు అది స్వయంగా దానిని బయలుపరచి వ్యక్తం చేయగలదు, కాని తిరిగి వెనువెంటనే ఈ అచేతనా వాతావరణం దానిని మరుగుపరుస్తుంది.

అతిమానసిక శక్తి 1956 లో భూమి మీదకు వచ్చినప్పుడు అది ఆ విధంగానే ఉంది. దివ్యకాంతి వరద ప్రవాహంలాగా, అద్భుతమైన వెలుగుతో, మహాశక్తితో, మహదాధిపత్యంతో వస్తుంటే, భూమి నుంచి దట్టమైన నీలకాంతుల అలల అచేతన ఎగసి దానినంతటినీ కబళించివేసింది. కిందికి దిగివస్తున్న మహాశక్తి నంతటినీ మింగి వేయడంతో అచేతనలో నుంచి అది తిరిగి స్వయంగా పనిచేయవలసి ఉంటుంది. అందువలననే విషయాల సత్ఫలితాలకు ఇక్కడ ఇంత సమయం పడుతుంది. భూమి పీల్చుకున్నదానిలో ప్రతిగా బయటకు వచ్చే దానిలో ఎక్కువ భాగం అచైతన్యపు ముసుగులోనే ఉంటుంది. అలా కాని పక్షంలో, దివ్యకాంతి భూమి మీద ప్రవహించి ఇప్పటికి ఎంతో కాలమైంది గనుక ఈపాటికి విషయాలు మార్పు చెంది ఉండాల్సింది.

6

ఇప్పుడు అతిమానసం ఇక్కడ ఉంది కనుక — ఈ భూమి మీద కేవలం నాకు మాత్రమే ఆ విషయం తెలిసి ఉన్నప్పటికీ, సంపూర్ణ విశ్వాసంతో కచ్చితంగా అది ఉన్నదనే విషయాన్ని నేను చెపుతున్నాను — ఈ రూపం నిర్వర్తించవలసినది అయిపోయి దాని స్థానంలో మరొక రూపం పనిని చేపట్టవలెనా? నేను ఈ ప్రశ్నను మిమ్మలను (దైవాన్ని) అడుగుతున్నాను, నాకు సమాధానం కావాలి — ఆ సంకే తాన్ని అనుసరించి ఇది ఇంకా నా పనే అని కచ్చితంగా తెలియాలిసింది. ఎన్నో వ్యతిరేకతలు, ఎన్ని ఖండనలు ఉన్నప్పటికీ నేను దీనిని అవశ్యం కొనసాగించాలని తెలియాలి.

7

29-2-1972

అతిమానసం కేవలం శారీరక మనస్సునందు అవతరిస్తేనే దాని సన్నిధి శాశ్వతంగా ఉండగలదు.

*

...నేను ఇక్కడ ఎందుకు ఉన్నానంటే నా శరీరం మార్పుకు మొదటి ప్రయత్నంగా ఇవ్వబడింది. శ్రీఅరవిందులు అలా చెప్పారు. నేను దానిని నెరవేరుస్తున్నాను.

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శరీరకణాల యోగం

1

కణాలలో ఒక చైతన్యం ఉంది: దానినే మనం "శరీరచైతన్యం" అంటున్నాం. అది పూర్తిగా శరీరంతో పెనవేసుకుని ఉంది. ఈ చైతన్యం మార్పు నొందడానికి చాలా ప్రతిబంధకం ఉంది. ఎందువల్లనంటే అది మార్పును పూర్తిగా వ్యతిరేకించే సమిష్టి సూచనల ప్రభావంలో ఉంది. కనుక ఈ సమిష్టి సూచనలతో ఎవరైనా సంఘర్షించ వలసినదే. కేవలం ప్రస్తుతపు సమిష్టి సూచనలతోనే కాదు, భూచైతన్యం మొత్తానికి సంబంధించిన సమిష్టి సూచనలతో. అవి మొట్టమొదటి మానవుడు రూపుదిద్దుకున్నటు వంటి భూమండలంలోని మానవ చైతన్యానికి సంబంధించినవి. పదార్థం శాశ్వతం అనే సత్యాన్ని కణాలు వాటికవి తెలుసుకోవాలంటే దానికి ముందు ఆ సూచనలను అధిగమించవలసినదే.

2

శరీరం అత్యంత తీవ్రమైన చిత్తశుద్ధితో నిరంతరం జపిస్తున్నది: "నేను ఎవరి నుంచైనా ఏమైనా గట్టిగా ఏమడగగలను? వ్యక్తిగతంగా నేను ఏమీ కాను, నాకేమీ తెలియదు, నేనేమీ చేయలేను. సత్యం నాలో చొచ్చుకుపోయి, నన్ను నిర్దేశిస్తే తప్ప, నేను కనీసం లేశమాత్రపు నిర్ణయమైనా తీసుకోవడంలోనూ, అన్నింటిలోకి శ్రేష్ఠమైన కార్యా చరణ ఏదో తెలుసుకోవడంలోనూ, అత్యల్పమైన పరిస్థితులలో కూడా జీవించటానికి గానూ అసమర్థురాలను. నేను ఏ దివ్యస్థితికి ఎదిగే దశకు మార్పుచెందాలో, ఈ భూమి మీద ఏ దివ్యత్వమైతే అభివ్యక్తం కావాలని కోరుకుంటున్నదో దానిని ఎలా అభివ్యక్తం చేయగలనో, ఆ సమర్థత నాకు ఎప్పటికైనా కలుగుతుందా?" కాని, ఓ ప్రభూ, నా అంతరంగ లోలోతుల నుంచి, మీ నుంచి, ఈ సమాధానం నిర్వివాదమైన

ధృఢవిశ్వాసంతో ఎప్పుడూ ఎందుకు వస్తున్నది: "నీవు చేయలేకపోతే ఈ భూమి మీద మరే శరీరమూ చేయలేదు". కాని చివరకు ఒకటే నిశ్చయం: నా ప్రయత్నాన్ని వదలిపెట్టకుండా ధృఢమైన పట్టుదలతో కొనసాగించాలి, మరణ పర్యంతము లేదా విజయపర్యంతము నేను ధృఢమైన పట్టుదలతో ఉండాలి.

8-9-1954

3

పదార్థంలో ఉన్న పెద్ద ఇబ్బంది ఏమంటే భౌతిక చైతన్యం (దానర్థం, పదార్థలంలోని మనస్సు) ప్రతి బంధకాల ఒత్తిడిలో రూపుదిద్దుకోవటమే — ప్రతిబంధకాలు, ఆటంకాలు, బాధలు, సంఘర్షణలు. ఒక విధంగా అది వాటితో మలచబడి నిరాశ, ఓటిమి, భంగపాటు ముద్రవేయబడి, ఒక గొప్ప ప్రతిబంధకంగా ఏర్పడింది.

దీని గురించే నేను చేస్తున్న పనిలో జాగ్రుతతో ఉన్నాను. అత్యంత భౌతిక చైతన్యం, అత్యంత భౌతిక మనస్సు కొరడాదెబ్బల ద్వారా కర్మానుష్ఠానానికీ, కృషి సల్పడానికీ, ముందుకు పోవడానికీ అలవాటు పడింది; అది లేకపోతే అదంతా తమస్సు. తరువాత అది, ఏమని ఊహిస్తుందంటే, ఎప్పుడూ ప్రతిబంధకాలనే, ఎప్పుడూ అడ్డంకులనే లేదా ఎప్పుడూ వ్యతిరేకతనే. దాని వలన గతి తీవ్రంగా మందగిస్తుంది. దాని అన్ని ప్రతిబంధకాల వెనుక దైవానుగ్రహం ఉన్నదనీ, దాని అన్ని వైఫల్యాల వెనుక విజయం ఉన్నదని, దానిఅన్ని బాధలు, కష్టాలు, వైరుధ్యాల వెనుక ఆనందం ఉన్నదనీ దానిని ఒప్పించడానికి చాలా నిర్దుష్టమైన, ఎంతో విస్పష్టమైన, తరచు పునరావృతమయే అనుభవాలు దానికి అవసరమవుతాయి. చేసే ప్రయత్నా లన్నింటిలో దీనినే చాలాసార్లు తిరిగి తిరిగి మననం చేసుకోవాలి. అన్ని ప్రయత్నాల్లోకి, ఈ ప్రయత్నం పదే పదే చేయాల్సి ఉంటుంది. నీలోని నైరాశ్యతను, లేదా ఒక సందేహాన్ని లేదా పూర్తిగా ఓటమితో భంగపాటును కలిగించే ఒక ఊహాజనితమైన తలంపును మారేటట్లు చేయడానికి లేదా పూర్తిగా తొలగించడానికి నిరంతరం ప్రయత్నించాలి.

నేను అన్నింటిని మినహాయించి ప్రత్యేకించి ఒక్క భౌతికచైతన్యం గురించే మాట్లాడుతున్నాను.

పైనుంచి ఏదైనా కిందికి దిగివస్తే, సహజంగానే, అది ఒక్కసారిగా గుద్దుకుంటూ ఫెళఫెళా పడిపోతుంది (ఈ విధంగా అని శ్రీమాత చేతితో బల్లపరుపుగా సైగ చేసి చూపిస్తారు), దాని తరువాత అంతా నిశ్శబ్దం, అంతా ఆగిపోతుంది, వేచి ఉంటుంది. కాని... సత్యం, ఆ సత్యచైతన్యం నిరంతరంగా ఎందుకు అభివ్యక్తం కాదో నేను అర్థం చేసుకున్నాను. ఎందువల్లనంటే దాని పరమమైన ఆధిపత్యశక్తికి, పదార్థ ఆధిపత్యశక్తికి చాలా తేడా ఉంది. పరమమైన ఆధిపత్యశక్తి ఎంత బలమైనదంటే దాని వలన పదార్థ ఆధిపత్యశక్తి నిర్మూలనం చేయబడుతుంది — కాని అప్పుడది పరివర్తన కాదు, అణచివేయబడి ధ్వంసమయిపోవడం. ప్రాచీనకాలంలో వారు అదే చేసే వారు — భౌతిక చైతన్యాన్నంతా పరమాధిపత్యశక్తి బరువు కింద ఇంక ఏదీ సంఘర్షించకుండా, ఏదీ వ్యతిరేకించకుండా అణచివేసేవారు. అప్పుడు ఒక అభిప్రాయం వ్యక్తం అయేది: "మొత్తానికి నేను చేయగలిగాను!" కాని అది అవలేదు, ఏమాత్రం కాలేదు! ఎందువల్లనంటే, మిగిలి ఉన్నది, కింద అడుగున, ఎప్పటిలాగే ఉంది, ఏమాత్రమూ మార్పు చెందకుండా.

ఇప్పుడు దానికి పూర్తిగా మారడానికి అవకాశం ఇవ్వబడింది; అందుకు నీవు దాని పూర్తి ఖేలనకు అవకాశం ఇవ్వాలి, అణచివేసే పరమాధిపత్యశక్తితో అవరోధం కలిగించకూడదు — ఇది నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను. కాని ఈ చైతన్యానికి బుద్ధిహీనతతో కూడిన మొండితనం ఉంది. ఇది ఎన్నోమార్లు బాధ కలిగినప్పుడు అనుభవంలోకి వచ్చేది. ఉదాహరణకు, ఒక తీవ్రమైన బాధకు లోనయినప్పుడు, అది ఎటువంటిదంటే, ఆ వ్యక్తికి ఇంక భరించలేని పరిస్థితిగా తోచినప్పుడు, దివ్యసంకేత కర్తవ్య సందేశం వల్ల జనించిన కదలిక (కణాలలో) ఏర్పడి — కణాలు అత్యవసర రక్షణ వర్తమానాన్ని చేరవేస్తాయి — అంతా ఆగిపోతుంది, బాధ అదృశ్యమైపోతుంది, తరచుగా (ఇప్పుడు ఎక్కువెక్కువగా) దాని స్థానంలో పరమానందభరితమైన అస్తిత్వ స్వాంతనానుభూతి ప్రతిష్టించబడుతుంది; కాని దానికి భౌతికచైతన్యం నుంచి వచ్చే ఈ బుద్ధిహీనమైన మొదటి ప్రతిక్రియ, "ఆహా, ఇది ఎంతకాలం ఉంటుందో చూస్తాం". సహజంగానే, ఈ స్పందన సమస్తాన్ని కూలదోస్తుంది — మళ్ళీ మొదటి నుంచి మొదలుపెట్ట వలసే వస్తుంది.

దాని ఫలితం ఎప్పటికీ ఉండాలంటే — ఏదో కనులు మిరుమిట్లు గొలుపుతూ వచ్చిపోయే అద్భుతం కాకూడదు — అది పరివర్తన వలన ఒనగూడిన ఫలితం

అయి ఉండాలని నేను గట్టిగా నమ్ముతున్నాను. తప్పకుండా చాలా, చాలా ఓర్పును కలిగి ఉండాలి — మనం వ్యవహరించే చైతన్యం చాలా నెమ్మదైనది, చాలా బరువైనది, చాలా పెడసరమైనది, మొండిది, శీఘ్రంగా ముందుకు పోలేనటువంటిది, తాను పొందినదానికి, తాను సత్యం అని అనుకున్నదానికి పట్టుకుని వేలాడేది; అది కేవలం లేశమాత్రమైన సత్యం అయినప్పటికీ దానినే పట్టుకుని వేలాడుతూ కదలడానికి ఇష్టపడదు. అప్పుడు దానిని బాగుచేయాలంటే, ఒకరికి తప్పకుండా ఎంతో ఓర్పు కావాలి — చాలా ఓర్పు కావాలి.

7-10-1964

4

పరిపూర్ణమైన నిశ్చేతన తరువాత వచ్చేది అంతరంగ ఆకాంక్ష (నేనెప్పుడూ కణాల ఆకాంక్షను ప్రస్తావిస్తాను — సరైన పదం లేక నేను ఆ పదాలనే వాడుతుంటాను; కాని దానిని వ్యక్తం చేయడానికి వేరే దారి లేదు) సమర్పణ, అది ఎటువంటిదంటే, పరమాత్మ ఇచ్ఛకు (అది తెలియబడనిది) తనంతతానుగా తటాలున స్పందించేది మరియు సంపూర్ణామోదం.

...ప్రతి క్షణమూ కణాలన్నీ తప్పకుండా (ఊర్ధ్వముఖంగా కదలికలేని నివేదనాపూర్వకమైన సైగ) ఒక ఆరాధనా భావముతో, ఒక ఆకాంక్షలో — ఒక ఆరాధన, ఒక ఆకాంక్ష, ఒక ఆరాధన... మరేదీ లేదు. అప్పుడు కొంత సమయం తరువాత అక్కడ ఆహ్లాదం కూడా చోటు చేసుకుంటుంది. తరువాత అదంతా పరమానందభరిత ప్రగాఢ విశ్వాసంలో ముగిసిపోతుంది. ఈ ప్రగాఢ విశ్వాసం కుదిరినప్పుడు అంతా సవ్యంగా ఉండిపోతుంది. కాని... చెప్పటం తేలిక, చేయడం చాలా కష్టం. కాని ప్రస్తుతానికి ఇదే సరైన పద్ధతి అని నేను గట్టిగా నమ్ముతున్నాను, మరొకటి లేదు.

24-3-1965

5

14 మార్చి 1973

నేను నా పాతమంత్రాన్ని మీకు చెప్పబోతున్నాను; ఇది బాహ్య అస్తిత్వాన్ని ప్రశాంతపరుస్తుంది:

ఓమ్ నమో భగవతే.

ఈ మూడు మాటలు. నాకు, వాటి అర్థం ఇది:

ఓమ్ — నేను పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

నమో — ఆయనకు వినమ్రతతో నమస్కరిస్తున్నాను.

భగవతే — నన్ను దివ్యం చేయి.

దీని అనువాదం ఇది. నాకు, అది ప్రతిదానినీ శాంతింపజేసే శక్తి కలిగినటువంటిది.

6

30 డిశంబరు 1972

విషయాలన్నీ ఒక కట్ట కడపటి దశకు చేరుకున్నాయి. ఉన్నదున్నట్లుగా, వాతావరణం వైభవం దిశగా ఉద్ధరించబడుతున్నది.... ఇంచుమించు అనూహ్యం. అదే సమయంలో ఒక అనుభూతి ఏ క్షణంలోనైనా... మరణించవచ్చు... "మృత్యువు" కాదు, కాని శరీరం బహుశా కరిగిపోవచ్చు, కనుక అవి రెండూ ఒకే సమయంలో ఒక చైతన్యాన్ని సంతరించుకుంటాయి (శ్రీమాత తల ఊపుతుంది) ...పాత విషయాలన్నీ అల్పంగా, కుర్రచేష్టలుగా, తెలివిమాలినవిగా అనిపిస్తున్నాయి — అక్కడ అందులో... అది అద్భుతం, ఆశ్చర్యజనకం.

కనుక శరీరానిది, ఈ శరీరానిది ఒక ప్రార్థన — అది ఎప్పుడూ ఒకే ప్రార్థనను చేస్తుంది:

నిన్ను తెలుసుకోవటానికి నాకు యోగ్యతను కలుగజేయి, నీ సేవ చేయటానికి నాకు యోగ్యతను కలుగజేయి, నీ అస్తిత్వంగా నాకు యోగ్యతను కలుగజేయి.

వృద్ధి నొందుతున్న శక్తిగా నాలో నాకు అనుభూతి కలుగుతున్నది.... కాని అది కొత్త లక్షణం కలిగినది. ...నిశ్శబ్దతలో, ధ్యానంలో.

7

10 మార్చి 1973

నేను ఎప్పుడూ పునశ్చరణ చేస్తుంటాను: "నీ ఇచ్ఛయే, నీ ఇచ్ఛయే, నీ ఇచ్ఛయే... నీ ఇచ్ఛయే జరుగును గాక, నీ ఇచ్ఛనే నన్ను ఆచరించనీ, నీ ఇచ్ఛనే నన్ను తెలుసుకోగలగనీ."

అంతేకాక: "నీవు లేనిది మరణం; నీ తోటిదే జీవితం". "మరణం" అంటే నేను భౌతికమైన మరణం అనే అర్థంలో చెప్పడం లేదు — అదీ కావచ్చు; అది ఎటువంటిదంటే నీ తోటి అనుసంధానం కోల్పోతే, అది ముగింపవుతుంది, కాని అది అసంభవం! నాకు అనుభవం కలుగుతున్నది... నేను పరం తత్ నని — ప్రస్తుత చైతన్యపు అడ్డంకులన్నీ ఉన్నప్పటికీ, అది అంతే. నేను ఎవరినైనా చూసినా (శ్రీమాత ఆ వ్యక్తిని పరంజ్యోతికి నివేదిస్తున్నట్లుగా చేతులను పరచి చూపిస్తారు.) అతడెవరైనా కాని: అది ఆ విధంగానే (తిరిగి అదే విధంగా చేతులు పరచి చూపించారు.)

(నిశ్శబ్దం)

సర్వవేళలా (ఎంతో ఆశ్చర్యం), సర్వవేళలా నాకు ఒకటే అనుభూతి. ఎద కౌగిలిలోని పసికూనను — ఎదకౌగిలిలో (దానినేమని పలుకను?) అది దివ్యచైతన్యం... సమస్తాన్ని ఇముడ్చుకునేది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ